ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య జిల్లా వార్తలు
5
గురువారం 26 సెప్టెంబరు 2024


చిన్నమండెం మండలంలో ఎండిపోయిన వేరుశనగ

కరువు కమ్మేసింది...


పెద్దమండ్యంలో ఎండిపోయిన పురాతన బావి

జిల్లాను కరువు రక్కసి కబళిస్తోంది. జిల్లాలో సుమారు ఏడు వేలకు పైగా ఉన్న చెరువులు, కుంటల్లో చుక్కనీళ్లు లేవు. బావులు అడుగంటి పోయాయి. వేయి అడుగులకుపైగా బోర్లు వేసినా నీటి జాడ కనిపించడం లేదు. పశువులు మేతకు..నీళ్లకు అల్లాడుతున్నాయి. వానలు సక్రమంగా పడకపోవడంతో జిల్లాలో సాగు సాధారణ స్థాయి కంటే సగానికి పైగా పడిపోయింది. జూన్‌లో కురిసిన వానలతో రైతులు వేరుశనగ, వరి పంటలను సాగు చేశారు. సరైన సమయంలో వానలు పడకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. వేరుశనగ రైతుకు కనీసం పెట్టుబడులు కూడా చేతికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. వరి పంట కూడా పూర్తిగా ఎండిపోతుండటంతో పశువులకు మేతగా వదిలేశారు. రెండు రోజులుగా జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నా వేరుశనగకు ఏమాత్రం ప్రయోజనం లేదని, పశువుల మేతకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు.

- చుక్కనీళ్లు లేని చెరువులు, కుంటలు..
- ఎక్కడికక్కడ ఎండుతున్న పంటలు
- నిండా ముంచేసిన వేరుశనగ పంట
- కనుచూపుమేర బీళ్లే...
- కరువు జిల్లాగా ప్రకటించాలని రైతుల డిమాండ్

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వర్షాభావ ప్రభావంతో జిల్లాలో కరువు తాండవిస్తోంది. ఎటుచూసినా పొలాలన్నీ బీళ్లుగానే దర్శనమిస్తున్నాయి. చెరువులు, కుంటలు ఎండిపోయాయి. అరకొర వర్షంతో సాగు చేసిన పంటలు ఎండిపోతుండటంతో వాటిని పశువులకు మేతగా వదిలేశారు. రాజంపేట మండలంలో అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడంతో పాటు మూడేళ్లుగా సక్రమంగా వర్షాలు కురవక తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడం.. వానలు కూడా సక్రమంగా పడకపోవడంతో.. ఈ ప్రాంతంలో సుమారు 10 వేల ఎకరాల భూమి బీడుగా మారింది. ఈ ప్రాంతంలో సుమారు 900 అడుగుల బోర్లు వేసినా నీళ్లు పడ లేదు. ఫలితంగా ఆకేపాడు, బ్రాహ్మణపల్లె, వత్తలూరు, బావికాడపల్లె, కొల్లావారిపల్లె, మేకవారిపల్లె చుట్టుప క్కల ప్రాంతాలలో తీవ్ర కరువు నెలకొని ఉంది. పలు చోట్ల సాగు చేసిన బొప్పాయి అరటి పంటలు నీళ్ల లేక ఎండిపోయాయి.

- లక్కిరెడ్డిపల్లె మండలంలో మూడేళ్లుగా కరువు ఛాయలు అలుముకున్నాయి. సకాలంలో వర్షాలు కుర వకపోవడంతో రైతులు సక్రమంగా పంటలు సాగు చేయడం లేదు. కొద్దిగా సాగైన వేరుశనగ, వరి పంటలు ఎండిపోయాయి. మండలంలో కనీసం ఒక చెరువుకు కూడా ఐదు సంవత్సరాలుగా చుక్క నీళ్లు లేవు. చెరువుల కింద ఉన్న భూములన్నీ బీళ్లుగా ఉన్నాయి. బోర్లు వేసినా నీళ్లు పడడం లేదు.
- గాలివీడు మండలంలో గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి కరువు తాండవిస్తోంది. మండ లంలో ఖరీఫ్ సీజన్‌లో 5 వేల ఎకరాల్లో వేరుశనగను సాగు చేశారు. 1650 ఎకరాల్లో వరి సాగు చేశారు. రెండు నెలలుగా వానలు లేకపోవడం తో వేరుశనగ, వరి పంటలు ఎండిపోతు న్నాయి. వరి సాగు కోసం నార్లు పోసిన కొంతమంది రైతులు వాటిని నాటకుండానే పొలంలో వదిలేశారు. మండలంలో చాలా వరకు చెరువులు నీళ్ల లేక బోసిపోయాయి. కనీసం మూగ జీవాలు కూడా నీళ్ల లేని పరి స్థితి.
- కలికిరి మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 1100 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. రెండు నెలలుగా వర్షా భావ పరిస్థితులు నెలకొనడంతో వేరు శనగ పైర్లు ఎండుముఖం పట్టాయి. ఎకరాకు కనీసం రెండు బస్తాలు కూడా దిగుబడి వచ్చేట్లు లేదు.
- రామసముద్రం మండలంలో ఉన్న 208 చెరువుల్లో పెద్దదైన అగ్రహారం చెరువు గత ఏడాది కాలంగా నీళ్ల లేక ఎండిపోయింది. ఈ చెరువు కింద ఉన్న 200 ఎకరాల ఆయకట్టు భూమి బీడుగా ఉంది.
- రామాపురం మండలంలో ఖరీఫ్‌లో 480 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. రెండు నెలలుగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో మొత్తం వేరుశనగ పంట ఎండిపోతోంది. ఎకరాకు కనీసం రెండు బస్తాలు కూడా దిగుబడి రాలేదు.

ఇదే పరిస్థితి జిల్లాలో ప్రధానంగా వేరుశనగ సాగు చేసే రాయచోటి, పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గా లలో కనిపిస్తోంది. పెట్టుబడులు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేక రైతులు ఆవే దన చెందుతున్నారు. జూన్‌లో కురిసిన వానలు చూసి మోసపోయామని రూ.లక్షల అప్పులు చేసి వేరుశనగ వేశామని వాపోతున్నారు. ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు చేస్తే రెండు, మూడు బస్తాలకు మించి దిగుబడి వచ్చిందని తాము బతికే దెట్లా అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 42,852 హెక్టార్లలో వేరుశనగ సాగు కావాల్సి ఉండగా కేవలం 10,809.2 హెక్టార్లలో మాత్రమే సాగైంది. వరి పంట కూడా 10,037 హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా 4504.5 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. ఇలా సాగైన కొద్దిపాటి పంటలు వానలు లేక ఎండిపోతున్నాయి. పలు చోట్ల రైతులు వరి నారును పొలం లోనే పశువుల మేతకు వదిలేశారు. కళ్లముందే పంటలు ఎండిపోతుండ డంతో వాటిని కాపాడుకోవడానికి లక్షల రూపాయలు ఖర్చు చేసి బోర్లు వేస్తున్నారు. ఆ బోర్లలోనూ నీళ్లు పడక రైతులు అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారు. రెండు రోజులుగా జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. ప్రస్తుతం పడుతున్న వర్షాల వల్ల వేరుశనగకు ఏమాత్రం ప్రయోజనం లేదని, వేరుశనగ కట్టె పశువులకు మేతగా ఉపయోగపడుతుందని రైతులు పేర్కొంటున్నారు.ఈ తీవ్ర కరువు నుంచి ప్రభుత్వం ఆదుకోవాలని, కరువు జిల్లాగా ప్రకటించా లని రైతులు కోరుతున్నారు.

గత ఏడాదీ నష్టాలు మిగిల్చింది



-చిన్నరెడ్డెప్పరెడ్డి, పర్తికోట ములకలచెరువు

నాలుగు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాను. సుమారు లక్ష రూపాయల వరకు ఖర్చు అయింది. ఖరీఫ్ సీజన్ మొదట్లో వర్షాలు సకాలంలో కురవడంతో వేరుశనగ పంటను సాగు చేశా. తీరా పూత, ఊడగల సమయంలో వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో వేరుశనగ పంట ఎండిపోతోంది. వేరుశనగ పంట సాగు చేస్తూ తరచూ నష్టాలు చవి చూస్తున్నాను..

రైతులను ఆదుకోవాలి



-తమ్మిశెట్టి పిచ్చయ్య, పూలుకుంట

వేరుశనగ, కంది, ఆముదం పంటలను సాగు చేశాను. వాటిని కాపాడుకోవడా నికి నాలుగు బోర్లు వేశాను. వాటిల్లో ఒక్కదాంట్లోనే నీళ్లు వస్తున్నాయి. లక్షలు ఖర్చు పెట్టి బోర్లు వేసినా ఉప యోగంలేదు. ప్రభుత్వం స్పందించి కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలి.

పశువుల మేతగా వేరుశనగ పంట



- గుర్రప్ప, గుర్రంకొండ

వర్షాలు సకాలంలో కురవకపోవడంతో సాగు చేసిన వేరుశనగ పంట ఎండిపో తోంది. నాకున్న రెండు ఎకరాల పొలంలో ఎకరా విస్తీర్ణంలో వేరుశనగ పంటను సాగు చేశాను. పంట సాగు దశలో వర్షాలు అరకొరగా కురిశాయి. దీంతో పంట కాయ దశకు వచ్చింది. ఈ సమయంలో వర్షాలు లేకపోవడంతో వేరుశనగ పంట ఎండిపోయి కాయలు లొత్తలుగా మారాయి. దీంతో ఇప్పుడు పంట సాగు చేసిన ఖర్చులు కూడా గిట్టుబాటు కూడా కావు. వేరుశనగ పంటను పశువుల మేతగా వినియోగించుకునే దుస్థితి నెలకొంది.

మేత కూడా దొరికేట్టుగా లేదు



- గోపి, దేవగుడిపల్లె, చిన్నమండెం

నాకు ఆవులు ఉన్నాయి. వేరుశనగ వేస్తే కనీసం పశువులకు మేత అయినా దొరుకు తుందని అనుకున్నా. దీంతో రెండు ఎక రాల్లో సుమారు రూ.60 వేల వరకు ఖర్చు చేసి వేరుశనగ సాగు చేశా. వానలు లేక.. చెట్టుకు రెండు, మూడు కాయలు మాత్రమే ఉన్నాయి. ఉన్న కాయలు కూడా లొట్టలుగా ఉన్నాయి. కనీసం వర్షం పడితే.. కాయల సంగతి దేవుడెరుగు..కనీసం పశువుల కోసం వేరుశనగ చెట్లు పెరకడానికి కూడా వానలు పడలేదు.

పెట్టుబడిపై నమ్మకం పోయింది



- నాగరాజు, దుద్యాల, సంబేపల్లె

వర్షాధారం కింద మూడు ఎకరాలు వేరుశ నగను సాగు చేశా. ఊడగలు, బుడ్డలు దిగే సమయంలో వానలు పడలేదు. పంట చూస్తే చెట్టుకు ఐదారు కాయలు, పది బుడ్డలు ఉన్నాయి. చెట్లు పీకేందుకు ఆకాశం వైపు చూస్తూ ఉన్నాం. పంట నూర్పిడికి ఇంకో 20 నుంచి 30 వేలు ఖర్చు అవుతుంది. దిగుబడి లేదు. పెట్టుబడి కూడా రాని పరిస్థితి. ఈ ఏడాది వర్షం రైతులను ముంచేసింది.




చుక్క నీళ్లు లేని రామసముద్రం మండలంలోని పెద్దదైన అగ్రహారం చెరువు, రాజంపేట మండలం బ్రాహ్మణపల్లె సమీపంలో ఎండిపోయిన అరటి, గుర్రంకొండ మండలం తలారివాండ్లపల్లె వద్ద నీరు లేక ఎండుతున్న వరి పంట

కేజీబీవీ పాఠశాల తనిఖీ

- విద్యార్థినులతో కలిసి సబ్ కలెక్టర్ భోజనం


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సబ్‌కలెక్టర్ నిధియాదేవి

పుల్లంపేట, సెప్టెంబరు 25 : మండల పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠ శాలను బుధవారం రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసు కున్నారు. అనంతరం హాస్టల్‌లో విద్యార్థినులతో కలిసి సబ్‌కలెక్టర్ మధ్యాహ్నం భోజనం చేశారు. పాఠశాలలో క్రీడా మైదానం అనువుగా లేదని, ప్రహరీగోడ అసంపూర్తిగా ఉందని, తాగునీటి సమస్య ఉందని విద్యార్థినులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో నాగ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల పరిశీలన

- వేంపల్లె, నిమ్మనపల్లె, దుబ్బిగానిపల్లెలో కేంద్ర బృందం పర్యటన

మదనపల్లెటౌన్/నిమ్మనపల్లె, సెప్టెంబరు 25: ఉపాధి హామీ పథకంలో కూలీలకు వస్తున్న ఆదాయం సరిపో తోందా..? ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రుణాలు సక్రమంగా అందుతున్నాయా..? హౌసింగ్ పథకాలకు ప్రభుత్వాలు ఇచ్చే సొమ్ములు ఎంత, సరిపోతున్నాయా అంటూ సీఏ ల్‌ఎం కమిటీ (కేంద్ర బృందం) లబ్ధిదారులను ఆరా తీసింది. బుధవారం మదనపల్లె మండలంలోని వేంపల్లె, దుబ్బిగానిపల్లెలో కేంద్ర బృందం సభ్యుడు ఎస్.సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా 2023-24 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం అందించిన ఎనిమిది సంక్షేమ పథకాలతో లబ్ధిదారులు ఎంత లబ్ధి పొందారు..అది సరిపోతుందా.. ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ప్రతి లబ్ధిదారుడిని అడిగి తెలుసుకున్నారు. రెండు గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో ఫారంపాండ్స్, బోర్‌వెల్ రీచార్జి స్ట్రక్చర్లు, మునగతోటలను కేంద్ర బృందం పరిశీలిం చింది. ఉద్యానశాఖ పరిధిలో మొక్కల చుట్టూ తవ్విన పాదులు, దీనికి కూలీలకు అందుతున్న సొమ్ము గురించి అడిగి తెలుసుకున్నారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యులకు బ్యాంకు లింకేజి రుణాలు ఎలా అందుతు న్నాయి, హౌసింగ్ పథకంలో ప్రభుత్వం కేటాయించిన సొమ్ములు సరిపోతున్నాయా అని అడిగారు. ఈ పథ కాలన్నింటిపై క్షేత్రస్థాయిలో విచారించి కేంద్ర ప్రభుత్వా నికి నివేదికలు పంపనున్నారు. కార్యక్రమంలో వేంపల్లె, దుబ్బిగానిపల్లె సర్పంచ్‌లు ఆదెమ్మ, బుడ్డయ్య, ఎంపీ డీవో కార్యాలయ ఏవో రెడ్డెమ్మ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రమణ, గణేష్, ఏపీవో సుబ్రమణ్యం, ఏపీఎం సురేష్‌రెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.


వేంపల్లెలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యుడు సుధాకర్‌రెడ్డి

నిమ్మనపల్లెలో..

మండలంలోని రాచవేటివారిపల్లి, తవళం, నిమ్మనపల్లి గ్రామ పంచాయతీలలో కేంద్ర బృందం పర్యటించి ప్ర జలకు కేంద్ర పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా ఆరాతీశారు. బుధవారం కేంద్ర బృందం సభ్యుడు ఎస్.సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరిగే గ్రామసభలకు మహిళలు వెళ్లి అన్ని విషయాలు తెలుసుకోవాలన్నారు. మూడు పంచాయతీల్లో పర్యటిం చిన కేంద్ర బృందం పథకాల అమలుపై సంతృప్తి వ్యకం చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ చలపతి రావు, ఏపీఎం రజనీకుమారి, హౌసింగ్ ఏఈ అమర, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయించే ముఠా అరెస్టు

- డీఎస్పీ కొండయ్యనాయుడు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 25: కురబలకోట సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద 14 మంది గంజాయి ముఠాను అరెస్టు చేసినట్లు డీఎస్పీ కొండయ్యనాయుడు తె లిపారు. మదనపల్లె రూరల్ స్టేషన్‌లో బుధవారం డీఎస్పీ విలేకరులతో మాట్లా డుతూ అంగళ్లు సమీపంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో బుధవారం మదనపల్లె రూరల్ సీఐ రమేష్, తాలుకా సీఐ కళా వెం కటరమణ, ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ తన సిబ్బందితో అక్కడికి వెళ్లి నిం దితులను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. వారి వద్ద నుంచి రూ.60 వేల విలువ చేసే 3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 14 మంది ముఠా సభ్యు లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రమేష్, తాలుకా సీఐ కళావెంకటరమణ, ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


గంజాయి ముఠా అరెస్టు చూపుతున్న డీఎస్పీ కొండయ్యనాయుడు

అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

- ఎంపీడీవోలు పనితీరు మెరుగుపరచుకోవాలి
- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), సెప్టెంబరు 25 : స్వర్ణాంధ్ర-2047 విజన్‌కు ప్రజాభిప్రాయంలో స్వచ్ఛందంగా పాల్గొని సమ్మిళిత అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం రాయ చోటి కలెక్టరేట్లోలోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఇది మంచి ప్రభుత్వం, స్వర్ణాంధ్ర విజ న్-2047, స్వచ్ఛ ఆంధ్ర ప్రజాభిప్రాయ సేకరణ అంశాలపై సబ్ కలెక్టర్లు, ఎంపీడీవోలు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, కళాశాలల ప్రిన్సిపాల్స్, పాఠశాలల హెచ్‌ఎంలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో ఈనెల 26 నుంచి 28 వరకు స్వర్ణాంధ్ర అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని విద్యాశాఖాధికా రులను ఆదేశించారు. అదే విధంగా నేడు, రేపు ప్రతి విద్యార్థికి అవగాహనా కార్యక్రమాలు నిర్వ హించి ఆన్‌లైన్ ద్వారా వారి అభిప్రాయాలు, ఆలోచనలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ఎంఈఓలు, ప్రిన్సిపాల్‌లు, హెచ్‌ఎంలతో సమన్వ యంగా కృషి చేయాలన్నారు. ఎంపీడీవోలు తమ పనితీరును మెరుగుపరచుకోవాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సీపీవో వెంకటపెద్దయ్య, డీఆర్‌వో సత్యనారాయణ, డీఈవో శివప్రకాశ్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



బి.మఠంలో భారీ వర్షం

- బద్వేలు-బి.మఠం మధ్య రాకపోకలు బంద్

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 25: కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మం డలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది.

జిల్లా అంతటా వర్షం కురిసినా బి.మఠంలో ఒకే రోజు అత్యధికంగా 13 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో సోమిరెడ్డిపల్లె బ్రిడ్జి వంకపైన నీళ్లు రావడంతో బద్వేలు, బి.మఠంకు రాకపోకలు దాదాపు నాలుగుగంటల పాటు నిలిచిపోయాయి. గతంలో ఎన్నిసార్లు ప్రభుత్వానికి, అధికా రులకు విషయాన్ని తెలిపి నా వంకపై బ్రిడ్జిని నిర్మించడం లేదని ప్రజలు వాపోయారు. బ్రిడ్జిపై వర్షం నీరు రావడంతో దాదాపు నాలుగు గంటల పాటు ఎక్కడికక్కడ వాహ నాలు ఆగిపోయాయని స్థానికులు తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



ఎర్రగుంట్ల, సెప్టెంబరు 25: ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో బుధవారం సాయంత్రం రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. ఎర్రగుంట్ల పట్టణంలోని శ్రీరాములపేటకు చెందిన రాజగోపాల్‌రెడ్డి (32) ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అప్పులు ఎక్కువ కావడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హెడ్‌కానిస్టేబుల్ నాగాంజనేయులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య ఇంద్రజ, కుమార్తె ఉన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి..



కలమల్ల-ముద్దనూరు మధ్యలో సుమారు 40 సంవత్సరాలు వయసుగల గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి మృతి చెంది వుండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిస్తే.. 9440627658, 9618828824 సెల్ నెంబర్లకు తెలపాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తిపై రాడ్లతో దాడి... పరిస్థితి విషమం



పులివెందుల టౌన్, సెప్టెంబరు 25: పులివెందుల పట్టణంలోని రాజారెడ్డి కాలనీలో రామాంజనేయులు అనే వ్యక్తిపై ఇద్దరు రాడ్లతో చేయడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా.. వేముల మండలం చాగలేరు గ్రామానికి చెందిన రామాంజనేయులుకు పట్టణంలోని రాజారెడ్డి కాలనీ సమీపంలో నివశిస్తున్న లక్ష్మితో వివాహేతర సంబంధం ఉందేమో అనే అనుమానంతో ఆమె కొడుకులు సందీప్, శివనాగేంద్రలు ఘర్షణ పడ్డారు. అక్కడే ఉన్నరాడ్లు తీసుకొని రామాంజనేయులు తలపై బలంగా కొట్టడంతో రోడ్డుపై రామాంజనేయులు రక్తగాయాలతో పడిపోయారు. వెంటనే అక్కడున్నవారు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కడపరిమ్స్‌కు తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

అప్పులబాధతో వ్యక్తి మృతి



సికెదిన్నె, సెప్టెంబరు 25: అప్పుల బాధతో చెన్నంరెడ్డి రామచంద్రారెడ్డి (43) మృతిచెందినట్లు చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలిలా.. చింతకొమ్మదిన్నె వాసి రామచంద్రారెడ్డి కడపలో ఓ ప్రైవేటు షోరూంలో సేల్స్‌మెన్‌గా పని చేస్తూ జీవించేవాడు. ఇటీవల గ్రామంలో దాదాపు రూ.15లక్షలు అప్పు చేసి ఇళ్లు నిర్మించుకున్నాడు. దీంతో భార్య తులసి కూడా ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసేదని, ఇద్దరూ సంపాదించినా అప్పు తీరకపోవడంతో కలత చెంది మంగళవారం రాత్రి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

పుల్లంపేట, సెప్టెంబరు 25: మండల పరిధిలోని సీతారాంపేట వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటేశ్వర్లు అనే వ్యక్తి మృతి చెందగా.. ఓబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లెకు చెందిన శివరాం తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. శివరాం తిరుపతిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరు అరెస్టు

రైల్వేకోడూరు(రూరల్) సెప్టెంబరు 25: మండలంలోని గంజాయి స్మగ్లర్లపై బుధవారం పోలీసులు దాడులు చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. రాజంపేటకు చెందిన పిండిపోయిన కార్తీక, కోడూరు పట్టణానికి చెందిన షేక్ మస్తాన్ పట్టణంలోని చిట్వేలి బ్రిడ్జి వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు కేజీల గంజాయి, రూ.2వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ హేమసుందరరావు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్ తరలించినట్లు తెలిపారు.

లంకమల అభయారణ్యంలో కూంబింగ్



సిద్దవటం, సెప్టెంబరు 25: లంకమల అభయారణ్యంలోని గొల్లపల్లి సెక్షన్‌లోని సమస్యాత్మక ప్రదేశాల్లో ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి, డిప్యూటీ రేంజ్ అధికారి ఓబులేసు ఆధ్వర్యంలో బుధవారం ఎర్రచందనం స్మగ్లర్ల ఆచూకీ కోసం కూంబింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఫారెస్ట్ రేంజర్ మాట్లాడుతూ సిద్దవటం రేంజ్‌లో కూంబింగ్ మరికొన్ని రోజులు కొనసాగుతుందని.. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. చెక్‌పోస్టుల వద్ద కూడా తనిఖీలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కూంబింగ్‌లో రోళ్లబోడు ఎఫ్‌బీవో బేస్ క్యాంప్ సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నిండు కుండల్లా.. జలాశయాలు

గండికోట, మైలవరం నుంచి భారీగా నీటి విడుదల ● పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ● అధికారుల హెచ్చరికలు

కొండాపురం/మైలవరం, సెప్టెంబరు 25: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పైతట్టు ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి నీరు చేరుతుండడంతో గండికోట, మైలవరం ప్రాజెక్టులు నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. ఈ ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో పెరగడంతో దిగువనున్న రిజర్వాయర్లు, నదుల్లోకి పెద్ద ఎత్తున నీటిని విడుదల చేస్తున్నారు. కాగా గండికోట ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 25.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అలాగే మైలవరం జలాశయం నీటి సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 5.8 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ నేపథ్యంలో అధికారులు దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. వివరాలిలా..

గండికోట ప్రాజెక్టు నుంచి 10వేల క్యూసెక్కులు..

గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి బుధవారం సాయింత్రం నుంచి నీటి విడుదలను పెంపుదల చేశారు. 2500 క్యూసెక్కులు నీరు విడుదల చేస్తుండగా దానిని 10000 క్యూసెక్కులకు పెంచినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టులోకి జీఎన్‌ఎస్‌ఎస్ కాలువ ద్వారా వచ్చే ఇన్‌ఫ్లో 10,000కు పెరగడంతో, గండికోట నుంచి మైలవరానికి నీటిని పెంచినట్లు తెలిపారు. అదేవిధంగా సీబీఆర్‌కు 1500 క్యూసెక్కులు, పెడిపాలెం రిజర్వాయిర్‌కు 770 క్యూసెక్కులు, వామికొండ, సర్వరాయసాగర్‌కు 700 క్యూసెక్కుల చొప్పున గండికోట ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.



పూర్తి స్థాయి సామర్థ్యానికి నీరు చేరడంతో కళకళలాడుతున్న గండికోట జలాశయం



ప్రాజెక్టు నుంచి మైలవరానికి నీరు విడుదలవుతున్న దృశ్యం



మైలవరం జలాశయంలో జలకళ



పెన్నా నదికి నీరు విడుదల

మైలవరం నుంచి 12 వేల క్యూసెక్కులు..

మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జలాశయ ఈఈ రమేష్ తెలిపారు. బుధవారం గండికోట జలాశయం నుంచి 10వేల క్యూసెక్కుల నీటిని మైలవరానికి విడుదల చేస్తుండటంతో.. మైలవరం నుంచి 4గేట్లు ఎత్తి పెన్నానదికి 12వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నామని తెలిపారు. ఉత్తర కాలువకు 50 క్యూసెక్కులు, దక్షిణ కాలువకు 180 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు. గండికోట జలాశయం నుంచి మైలవరానికి ఇన్‌ఫ్లో మరింత పెరిగితే పెన్నానదికి వదులుతామని.. పెన్నాపరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

స్వర్ణాంధ్ర విజన్‌లో ప్రజలు భాగస్వామ్యం కావాలి

● కలెక్టర్ లోతేటి శివశంకర్

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 25: స్వర్ణాంధ్ర విజన్‌లో ప్రజలందరూ భాగస్వాములై అమూల్యమైన అభిప్రాయాలను తెలపాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. బుధవారం కడప నగరం ఉక్కాయపల్లె ప్లాజా వద్ద నిర్వహించిన స్వర్ణాంధ్ర-2047 వార్డుసభలో కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డితో కలిసి పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వందరోజుల పాలనపై 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం చేపడుతోందన్నారు. ప్రజలందరూ జిల్లా అర్థికాభివృద్ధికి అమూల్యమైన సలహాలు, సూచనలను క్యూఆర్ కోడ్ ద్వారా తెలపాలని సూచించారు. 2047నాటికి భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి వంద సంవత్సరాలు పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర విజన్-2047తో సంక్షేమ అభివృద్ధి, ఆర్థికాభివృద్ధికి తోడ్పడే విధంగా రూపకల్పన చేశారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో వాగులు, వంకలు చెరువులు డ్రైనేజీలపై ఎవరైనా అక్రమ కట్టడాలు నిర్మిస్తే వాటిని వెంటనే తొలగిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. హౌసింగ్ పథకం కొనసాగుతుందని మార్చి 2025 లోపు స్థలం పొందిన ప్రతి ఒక్కరూ గృహాన్ని నిర్మించుకోవాలని సూచించారు. ఆర్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 40వ డివిజన్‌లో డ్రైన్లు సరిగా లేవని, అందుకు రూ.27 లక్షలు మంజూరు చేయాలని కోరగా 15రోజుల్లో పనులు చేపట్టి త్వరగా పూర్తిచేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.



మహిళాప్రాంగణంలో నిరుపయోగంగా ఉన్న వాహనాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

2న ఆదరణ పరికరాలు పంపిణీ

టీడీపీ ప్రభుత్వంలో ఆదరణ కింద మంజూరైన పరకరాలను అక్టోబరు 2న లబ్ధిదారులకు అందిస్తామని కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. బుధవారం మహిళా ప్రాంగణంలో నిరుపయోగంగా నిల్వ చేసిన కుట్టుమిషన్లను, స్కిల్ మిషనరీ యంత్రాలను, గార్బేజ్ ఆటోలు, బైండింగ్ మిషన్లను కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ఆదరణ కింద ఈ మిషనరీలు మంజూరయ్యాయన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక వీటన్నింటినీ పక్కనబెట్టి మహిళా ప్రాంగణలో నిరుపయోగంగా ఉంచారని తెలిపారు. వీటన్నింటినీ అందుబాటులోకి తెచ్చి అక్టోబరు 2న గాంధి జయంతి రోజున లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వైవో నందన్, అడిషనల్ కమిషనర్ రాకేశ్‌చంద్రన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.





లబ్ధిదారులకు అందజేయకుండా మూలన పడేసిన వాహనాలు, కుట్టుమిషన్లు

పటిష్టంగా ఉచిత ఇసుక సరఫరా

రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు పారదర్శక విధానంతో జిల్లాలో ఉచిత ఇసుక సరఫరాను పటిష్టంగా అమలు చేస్తున్నట్లు కలెక్టర్ లోతేటి శివశంకర్ రాష్ట్ర గనులు, భూగర్భశాఖ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌కు వివరించారు. బుధవారం విజయవాడ నుంచి గనులు భూగర్భశాఖ కార్యాలయం నుంచి రాష్ట్ర కార్యదర్శి జిల్లాల్లో అమలవుతున్న ఉచిత ఇసుక సరఫరా అంశంపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో తీసుకున్న నిర్ణయాలను, జిల్లాలో పాటించాల్సిన చర్యలను ఆయన వివరించారు. రాష్ట్రస్థాయిలో ఇసుక రవాణాలో తీసుకున్న నిర్ణయాలు, తీర్మానాలు, బుకింగ్ అనంతరం సరఫరా కావాల్సిన ఇసుక పంపకాలు, పెసిలిటేషన్ కేంద్రాల్లో గుర్తించిన, గమనించిన కీలక సమస్యలు, ఐఆర్ఎస్ రిపోర్ట్స్, జీఎస్టీ తదితర అంశాలపై పవర్ పాయింట్ ద్వారా వివరించారు. జిల్లాస్థాయి ఇసుక కమిటీ, రవాణాదారుల మధ్య సేవాస్థాయి ఒప్పందం అంశం, రవాణా దారుల పనితీరు తప్పనిసరి చెల్లింపుల్లో వినహాయింపులు గూర్చి వివరించారు. రవాణా ఖర్చుల్లో భాగంగా 0-10 కి.మీల లోపు, 10 కి.మీల పరిధిలో 20 మెట్రిక్ టన్నుల ఇసుక ట్రక్కులకు చెల్లించాల్సిన నిర్ధారిత రేటు, 80 కిలో మీటర్ల పరిధిలో టన్నుల పరిమాణం, కిలో మీటర్ల ప్రకారం రేట్లు చెల్లింపు తదితరాలపై వివరించారు. జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, ఇసుక రాయల్టీ అధికారి విమలమ్మ, రవాణా ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు పాల్గొన్నారు.

పర్యాటక స్పృహ మనతోనే ప్రారంభం కావాలి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 25: పర్యాటకం పట్ల స్పృహ మన తోనే ప్రారంభం కావాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య తెలిపారు. బుధవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ముందస్తు వేడుకల్లో భాగంగా రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దనరాజు ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల ఫొటోల ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మన చుట్టుపక్కల పర్యాటక ప్రాంతాలు సందర్శించేందుకు మనం తొలి ప్రాధాన్యత నివ్వాలన్నారు. కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్, పద్మ ప్రియ చంద్రారెడ్డి, జి.వెంకటేశ్వర్ రావు, శ్రీనివాసులు, రామలింగారెడ్డి, డేవిడ్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గండికోటపై పదివేల పుస్తకాలు పంపిణీ

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈ నెల 27న గండికోటలో ఇంటాక్ 'మన గండికోట' పేరిట రూపొందించిన పదివేల పాకెట్ పుస్తకాలను పంపిణీ చేయనుంది. ఇంటాక్ సంస్థ జిల్లా చాప్టరు కన్వీనరు లయన్ కె.చిన్నపరెడ్డి ఉత్సవాలకు హాజరు కానున్న ప్రజలకు గండికోట గురించి క్లుప్తంగా సమాచారం అందించేందుకు 34 పేజీల మినీ బుక్ రూపొందించనున్నారు. 18 ఫొటోలున్న ఈ పుస్తకంలో గండికోటలోని ప్రముఖ ప్రాంతాలు, చారిత్రక నిర్మాణాల గురించి ప్రాథమిక సమాచారం అందించనున్నారు.

జేబీ హాస్పిటల్‌లో రోబో ద్వారా క్లిష్టమైన సర్జరీ

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 25: పేషంటు ఓబులమ్మకు రెండు కాళ్లు బాగా అరిగిపోయి.. తీవ్రంగా వంకర పోయి పలు హాస్పిటల్స్‌లో తిరిగారు. అన్ని హాస్పిటల్స్‌లో ఆమె మోకాలు ఎక్కువ అరిగిపోయి ఎక్కువ వంకర పోవడంతో హింజెడ్‌లేదా కన్‌స్ట్రెండ్ మోకాలు మార్పిడి చేయాలని తెలిపారు. దీనికి చాలా ఖర్చు అవుతుందని తెలిపారు. వారు అంత ఖర్చు చేయలేమని.. అన్ని చోట్లా తిరగలేక కడపలోని జేబీ హాస్పిటల్‌కు రాగా డాక్టరు జహంగీర్‌బాషా ఆమెను పరీక్షించి రోబోద్వారా ఈ ఆపరేషన్ సక్సెస్‌ఫుల్‌గా చేయగలుగుతామని పేషంటుకు ధైర్యం చెప్పి.. రోబో ద్వారా ఆపరేషన్ చేసి పేషంటును మరుసటి రోజు నడిపించారు. ఈరోబో ద్వారా వంకర కలిగిన మోకాళ్లకు ఆపరేషన్లు అతిసులభంగా.. తక్కువ సమయంలో అతి తక్కువ రక్తస్రావం, కచ్చితత్వంతో చేగలమని డాక్టర్ తెలిపారు.

ఓబులమ్మ ఆపరేషన్ తరువాత ఇంత సులభంగా నడవగలుగుతానని అనుకోలేదని తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్స్ సీఈఓ డాక్టర్ జయభారతి మాట్లాడుతూ తమ వద్ద రోబో ఆపరేషన్లు అతి తక్కువ ధరకు చేస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



సర్జరీ చేయించుకున్న ఓబుళమ్మతో డాక్టర్ జహంగీర్ బాషా, జేబీ హాస్పిటల్ సిబ్బంది తదితరులు

ట్రిపుల్‌ఐటీ అకడమిక్ డీన్‌గా కైలాష్



రమేష్‌కైలాష్‌ను సత్కరిస్తున్న అసిస్టెంట్‌ప్రొఫెసర్లు

వేంపల్లె, సెప్టెంబరు 25: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో అకడమిక్ డీన్‌గా సివిల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.రమేష్ కైలాష్‌ను డైరెక్టర్ గుప్త నియమించారు. డీన్ రత్నకుమారి స్థానంలో ఆయన్ను నియమించారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకటేష్‌ను నియమించారు. గతంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్‌గా ఉన్న ఇమ్రాన్ స్థానంలో ఆయన్ను నియమించారు. కొత్తగా నియమించిన ఇద్దరిని ఏఓ రవికుమార్, ఫైనాన్స్ అధికారి కోటేశ్వరి తదితరులు సత్కరించారు.

వంట నూనెను తిరిగి వాడడం మానుకోండి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 25: నూనెరహిత సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల జీవన ప్రమాణ రేటు పెంచుకోవచ్చని వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి తెలిపారు. బువారం వైవీయూలో డిపార్ట్‌మెంటు ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ రీపర్పస్ యూజ్డ్ కుకింగ్ ఆయిల్ స్టార్ గ్లోబల్ ఏజన్సీ సంయుక్త ఆధ్వర్యంలో వంటనూనెను తిరిగి వాడడం మానుకోండి, మీ తలరాతను కాపాడుకోండిపై అవగాహన నిర్వహించారు. ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ రామక్రిష్ణ, ఎన్విరాన్‌మెంట్ సైన్స్ సహాయాచార్యులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నిర్మలగిరి కాలనీని పరిశీలించిన వైద్య బృందం



వివరాలు సేకరిస్తున్న జిల్లా వైద్యాధికారులు

సిద్దవటం, సెప్టెంబరు 25: మండలంలోని బొగ్గుడివారిపల్లె గ్రామ పంచాయతీ నిర్మలగిరి కాలనీలో మంగళవారం ఇద్దరు చిన్నారులు మృతి చెందడంతో ఆ ప్రాంతాన్ని కడప డీఎంహెచ్‌వో నాగరాజు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మనోరమ, అడిషనల్ డీఎంహెచ్‌వో ఉమామహేశ్వర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ ఇద్దరు చిన్నారుల మృతిపై చుట్టుపక్కల ప్రాంతాల వారిని విచారించి వివరాలు సేకరించామని, ఇక్కడ ఎవరికీ ఎటువంటి జ్వరాలు లేవని, ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రత లేకుండా ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని, ముఖ్యంగా నీరు నిల్వలేకుండా చూసుకోవాలని ప్రజలకు తెలియజేశారు. ఇద్దరు చిన్నారులు మృతిపై పూర్తి వివరాలు సేకరించామని, వారి ఆరోగ్య సమస్య లక్షణాలు, జ్వరం వల్ల మృతి చెందలేదని తెలియజేశారు. వైద్యసిబ్బంది ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించారని, అందరూ ఆరోగ్యంగా ఉన్నారని, ఏదైన సమస్య ఉంటే సమీప ప్రైమరీ హెల్త్‌సెంటర్‌కు వెళ్లి వైద్యులతో సంప్రదించాలని తెలియజేశారు. మృతిచెందిన చిన్నారుల గుడారం చుట్టూ, పురవీధుల్లో అపరిశుభ్రతను తొలగించి బ్లీచింగ్ పిచికారి చేశారు. కార్యక్రమంలో ప్రైమరీ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఇన్‌చార్జి డీఈగా కేఎన్‌ఎం ప్రసాద్

రామాపురం, సెప్టెంబరు 25: అన్నమయ్య జిల్లా రాయచోటి హౌసింగ్ ఇన్‌చార్జి డీఈగా కేఎన్‌యం ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాపురం మండల హౌసింగ్ అధికారిగా పనిచేస్తూ అధికారుల ఆదేశాల మేరకు తమకు ఇన్‌చార్జి డీఈగా ఇచ్చారని ఆయన తెలిపారు.

400 మందికి నేత్ర పరీక్షలు

సుండుపల్లె, సెప్టెంబరు 25: మండల కేంద్రంలోని ఆ రెమ్మ దేవాలయం వద్ద బుధవారం శ్రీవెంకటేశ్వర అరవింద హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 400 మంది పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేశారు. ఆపరేషన్‌కు అవసరమైనవారికి రాయచోటి అరవింద్ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయించనున్నట్లు నిర్వాహకులు అజయ్‌రెడ్డి, ఆరెంరెడ్డి తదితరులు తెలిపారు.

పద్యాలపోటీ విజేతలకు బహుమతులు

లక్కిరెడ్డిపల్లె సెప్టెంబరు 25: దేశభాషలందు తెలుగు లెస్స అని పర్వతరెడ్డిగారిపల్లె ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు తెలిపారు. బుధవారం ఆ పాఠశాలలో పదో వ తరగతి విద్యార్థులకు పద్యాల పోటీ పరీక్ష నిర్వహించారు. మొదటి మూడు స్థానాల్లో నిలచి రూప, శర్వానంద, దివ్యకు వరుసగా రూ. 2016, 1016 516 నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హెచ్ సి శ్రీనివాసులు, సాయిచరణ్ యాదవ్, రవిశంకర్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు

భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, సెప్టెంబరు 25: నియోజకవర్గంలో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో రాంప్రసాద్‌రెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వంలో పేదల భూములన్నీ కొంత మంది బడా నాయకులు ఆక్రమించు కున్నారని, అవన్నీ తిరిగి స్వాధీనం చేసుకుని పేదలకు పంచిపెడతామ న్నారు. జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట నియోజకవర్గాల్లో భూ ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రాబోయే ఐదేళ్లలో భూ బాధితుల సమస్యలను అప్పటి కప్పుడే పరిష్కరించి న్యాయం చేస్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలు మూలల నుంచి ప్రజలు వివిధ సమస్యలపై ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రికి వినతి పత్రాలు సమర్పించారు. సమస్యలన్నీ వెంటనే పరిష్కరిస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

గాలేరు - నగరి సుజల స్రవంతి ద్వారా గుంజనేరుకు నీరు

● ఎమ్మెల్యే అరవ శ్రీధర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

పెనగలూరు, సెప్టెంబరు 25 : గాలేరు - నగరి సుజల స్రవంతి ద్వారా రాబోయే రోజుల్లో గుంజనేరుకు అక్కడి నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువులకు నీరందించడంపై ముఖ్యమంత్రితో చర్చించామని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. బుధవారం పెనగలూరు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీడీవో వరప్రసాద్ అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాలేరు - నగిరి సుజల స్రవంతి ద్వారా రాబోయే రోజుల్లో గుంజనేరుకు అక్కడి నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువులకు నీరందించడంపై ముఖ్యమంత్రితో చర్చించామని తెలిపారు. పెనగలూరు చెరువుకట్టకు మరమ్మతులు చేయించనున్నట్లు తెలిపారు. రక్షిత మంచినీరు, వీధుల్లో సిమెంటు రోడ్లు , గ్రామాల మధ్య లింకురోడ్లు, దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మండలంలోని 14 మంది గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ట్రస్టు ద్వారా ఒక్కొక్కరికి 5 వేల రూపాయల వంతున ఆర్థికసాయం చేయనున్నట్లు ప్రకటించారు. అంగన్వాడీ సిబ్బంది ప్రదర్శించిన ఆహార పదార్థాలను పరిశీలించారు. అంగన్వాడీ సిబ్బంది స్వయంగా తయారు చేసిన వంటలను రుచికి రుచి చూశారు. ఈ సమావేశంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, తహసీల్దారు సీహెచ్ ఇంద్రాణి, ఎంఈవోలు గిరి వరదయ్య, నాగసుబ్బరాయుడు, సీడీపీవో రాజేశ్వరి, హౌసింగ్ ఏఈ హరిప్రసాద్, టీడీపీ జనసేన నాయకులు నాగేశ్వరయ్యనాయుడు, కేఎన్ ఆర్, లేపాక శ్రీనివాసులరెడ్డి, బాబునాయుడు, దామోదర్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస నాయుడు, జి.రెడ్డయ్య, యానాదయ్య, గంగినాయుడు,సత్యనారాయణనాయుడు పాల్గొన్నారు.

సిద్దవటం : బొగ్గుడివారిపల్లె సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ పాల్గొన్నారు.

వైద్య సేవలపై అజాగ్రత్త వహిస్తే చర్యలు

వీరబల్లి, సెప్టెంబరు 25: వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన వారిపై అజాగ్రత్త వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య వైద్య సిబ్బందిని హెచ్చరించారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్లు సమ్మెలో ఉన్నందున, ఆసుపత్రికి వచ్చే వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా వైద్య సేవలు అందించాలనిసిబ్బందికి సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సుధాకర్, యూడీసీ సుజిత్, ల్యాబ్ టెక్నీషియన్ కల్పన ఫార్మసిస్ట్ కృష్ణయ్య, స్టాఫ్ నర్సులు తదితరులు పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేయాలి

గాలివీడు, సెప్టెంబరు25: ప్రాథమిక విద్యా వ్యవస్థ కనుమరగయ్యేలా గత ప్రభుత్వం జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వు 117ను రద్దు చేయాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర బాధ్యుడు కొండూరు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. నేడు గాలివీడు మండలంలో ఆ అసోసియేషన్ (ఎన్‌టీఏ) సభ్యత్వ నమోదు సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రాథమిక విద్యా వ్యవస్థ నిర్వీర్యం అయ్యేలా విడుదల చేసిన ప్రభుత్వ ఉత్తర్వు 117ను వెంటనే రద్దు చేయాలని, దాంతో రాష్ట్రంలో విద్యా వ్యవస్థను గాడిలో పెట్టడానికి అవకాశం కలుగుతుందన్నారు. విద్యాశాఖలో అన్ని రకాల యాప్‌లను రద్దు తదితర అంశాలను ప్రస్తావించారు. రమేశ్, సీవీ రమణ, శ్రీరాములు నాయక్, బచ్చల శ్రీనివాసులు, జనార్దన్‌రాజు, వెంకటయ్య, రమణయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

రాయచోటిటౌన్, సెప్టెంబరు25: అన్నమయ్య జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి ఆదుకోవాలని సీపీయం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన నియోజకవర్గ కార్యదర్శి రామాంజులతో కలిసి ఎగువ అబ్బవరం సమీపంలో గల కంచాలమ్మ గండి, గున్నికుంట్ల రోడ్డులోని ఇనాయత్‌ఖాన్ చెరువు, పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పైర్లు వర్షాలు లేక ఎండిపోతున్నాయని,, భూగర్భ జలాలు తగ్గిపోవడంతో బోర్లలో కూడా ఎండిపోయాయన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. హంద్రీ-నీవా నీటితో జిల్లాలోని అన్ని చెరువులను నింపి రైతులను ఆదుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

వైద్య శిబిరంలో 65 మందికి సేవలు

వీరబల్లి, సెప్టెంబరు25: విభిన్న ప్రతిభావంతుల కోసం బుధవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం 65 మంది సేవలందుకున్నారు. హలీంకో సంస్థ వారు, వైకల్య శాతాన్ని నిర్ధారించి వారికి తగిన ఉపకరణాలను అందిస్తారు. ఈ కార్యక్రమాన్ని ఐఈ కోఆర్డినేటర్ జనార్దన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సూపరింటెండెంట్ అనిల్‌హలీం, కోసంస్థ సిబ్బంది, రూపేష్, ఆసిఫ్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

రాయచోటిటౌన్, సెప్టెంబరు25: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని రాయచోటి పట్టణ ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి సూచించారు. బుధవారం ఆయన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు.

విద్యార్థులకు ఆపదమిత్ర శిక్షణ

సంబేపల్లె, సెప్టెంబరు 25: ప్రకృతి విపత్తులు సంభించినప్పుడు తీసుకునే ముందస్తు జాగ్రత్తలపై ఆపద మిత్ర కార్యక్రమం ద్వారా ఇచ్చే శిక్షణ పొంద డానికి స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు, యూనిట్ లీడర్లు తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆపద మిత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యాయులు రెడ్డెన్న, రామయ్య, దేవప్రసాద్ రెడ్డి, రెడ్డెయ్యరాజు, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

రామాపురం, సెప్టెంబరు25: భూసార పరీక్షల ఆధారంగా సాగు చేస్తే పెట్టుబడులు తగ్గడంతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చునని అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నల్లగుట్టపల్లిలో బుధవారం మండల వ్యవ సాయాధికారి ఆధ్వర్యంలో రెండవ రోజు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యానవనశాఖ అధికారి టీ. నాగమణి, మండల పశువైద్యాధికారి పాల్గొన్నారు. రైల్వే కోడూరు, లక్కిరెడ్డిపల్లె , ఓబులవారిపల్లెమండలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

'సూపర్ సిక్స్' అమలులో ఎన్డీఏ విఫలం..

రాయచోటి (కలెక్టరేట్) సెప్టంబర్ 25 : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు సూపర్‌సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలని కోరుతూ అన్నమయ్య జి ల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ముందు "థాలీ బజావో" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్డీఏ అధికారంలోకి వచ్చి వంద రోజులు కావస్తున్నా సూపర్‌సిక్స్ అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎసీసీ జనరల్ సెక్రెటరీ అల్లా బకష్, అమీర్‌బాషా, మహ్మద్‌అలి, గోసాలదేవి తదితరులు పాల్గొన్నారు.

అంగవైకల్య నిర్ధారణ శిబిరం

నందలూరు, సెప్టెంబరు 22 : జిల్లా డిజేబుల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో అలిమ్‌కో సౌజన్యంతో బుధవారం నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగవైకల్య నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మందికి పైగా దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, జిల్లా డిజేబుల్ వెల్ఫేర్ జూనియర్ అసిస్టెంట్ రమేష్, అలీమ్ కో సంస్థ అధికారులు ఆశిష్‌కుమార్, శివం, ఆడియాలజిస్ట్ నవీన్‌కుమార్, సమ్మిళిత ఉపాధ్యాయులు రంగస్వామి, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ అమలుపై శ్రద్ధ పెట్టాలి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 25: భూ యజమాని సంతకం లేకుండా సీసీఆర్‌సీ కార్డులు ఇస్తామని మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక పార్టీ కార్యా లయంలో విలేకరులతో మాట్లాడుతూ పంటసాగు హక్కు పత్రం-2019 చట్టాన్ని సవరించకుండా సీసీఆర్‌సీ కార్డులపై ప్రకటనతో ఉపయోగం లేదన్నారు. కౌలు రైతు సంఘాలు, రైతు సంఘాలు, వ్యవసాయ రంగ నిపుణులతో సమావేశాన్ని నిర్వహించి వారి అభిప్రాయాన్ని కూడా తీసుకోవాలన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు అభినందన

చిట్వేలి, సెప్టెంబరు 25 : 30 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ కడప ఆధ్వ ర్యంలో నిర్వహించిన కంబైన్డ్ వార్షిక శిక్షణ శిబిరంలో చిట్వేలి ఎన్‌సీసీ విద్యార్థులు సాయికిరణ్ ఫైరింగ్‌లో, చేతిపట్టు రమ్య డ్రిల్‌లో, కీర్తి, నవ్య కీర్తి, నవ్య, ఆటల పోటీల్లో గోల్డ్‌మెడల్స్ సాధించారు. ఆయా విద్యార్థులకు బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలోఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్, ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ అభినందించారు. పాఠశాల కమిటీ చైర్మన్ శివశంకర్‌రాజు, ఉపాధ్యాయులు దుర్గరాజు, చంద్రయ్య తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు లేబాక విద్యార్థులు

నందలూరు, సెప్టెంబరు 25 : రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు లేబాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివరాంప్రసాద్ తెలిపారు. ఈ నెల 21న కడప పట్టణంలోని మున్సిపల్ స్టేడియంలో అంతర్‌జిల్లాల బాస్కెట్‌బాల్ ఎంపికల్లో అండర్-17 విభాగంలో జగదీష్, శుభాంకర్, అండర్-14 విభాగంలో శివచైతన్య, శశికిరణ్‌లు అత్యుత్తమ ప్రదర్శన ప్రదర్శించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

బోరు కోసం ఘర్షణ

● ఆరుగురిపై కేసు నమోదు

సంబేపల్లె, సెప్టెంబరు 25: బోరు కోసం ఇరువర్గాలు ఘర్షణ పడడంతో ఆరుగురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. పోలీసుల వివరాల మేరకు... మండల పరిధిలోని రౌతుకుంట గ్రామం కుమ్మరపల్లికి చెందిన వేణుగోపాల్‌రెడ్డి, యాదిరి చిన్నమల్లయ్యలు బోరు కోసం ఘర్షణ పడి కట్టెలు రాళ్లతో దాడి చేసుకోవడంతో ఇరువర్గాలకు చెందిన 8 మందికి గాయాలైనట్లు తెలిపారు. గాయపడ్డ వారిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పండిట్ దీన్‌దయాళ్‌కు నివాళి

రాజంపేట, సెప్టెంబరు 25 : బీజేపీ వ్యవ స్థాపకుడు, ఏకాత్మ మానవవాద సిద్ధాంతకర్త, అంత్యోదయ స్ఫూర్తి ప్రదాత పండిట్ దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా బుధవారం రాజంపేట పార్లమెంట్ బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.జిల్లా కార్యదర్శి నరేంద్రరాజు ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్, మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: సీని యర్ నాయకుడు అరమాటి శివగంగిరెడ్డి ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. వెంకట్రామరాజు, వెంకటేశు, హరినాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: మండల బీజేపీ అధ్యక్షుడు జయచంద్రనాయుడు, సీనియర్ నాయకుడు కృష్ణ ఆధ్వర్యంలో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నివాళులర్పించారు. హెచ్ఎం వెంక టేశ్వర్లు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ విజయమోహన్ రామచంద్రయ్య, ఆరీఫ్, షఫీనాయక్, ముక్తార్, జేకే రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన కలిగి ఉండాలి

సుండుపల్లె, సెప్టెంబరు 25: ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీపై అవగాహన కలిగి ఉండాలని డీఆర్ అల్లావలి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 12 నుంచి అక్టోబరు 12వ తేదీ వరకు 200 గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు.వైద్య సిబ్బంది వెంకట్రమణ, సుబ్బరాజు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం

సిద్దవటం, సెప్టెంబరు 25 : పౌష్టికాహారం రక్తహీనతను నివారించవచ్చునని ఏసీడీపీవో శోభారాణి అన్నారు. బుధవారం మండలంలోని సిద్దవటం-1 టక్కోలు హరిజనవాడ, మూలపల్లె, మాధవరం-1 ఎస్‌కేఆర్ నగర్, హరిజనవాడ, సాక్ష్యం అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు.

టీడీపీ ఓటమికి మేడా కుటుంబమే కారణం: సుగవాసి



మాట్లాడుతున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

నందలూరు, సెప్టెంబరు 25: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాజంపేట నియోజక వర్గంలో తెలుగుదేశంపార్టీ ఓటమికి మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అతని కుటుంబమే కారణమని టీడీపీ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం ఆరోపించారు. బుధవారం నూకినేనిపల్లె గ్రామ పంచాయతీలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీకి మేడా కుటుంబానికి ఎటువంటి సంబంధం లేదని ఆయన అన్నారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మేడా విజయశేఖర్‌రెడ్డి సుండుపల్లె మండలంలో వైసీపీకి ఏజెంట్లను ఏర్పాటు చేశారని ఆరోపించారు. మేడా కుటుంబం టీడీపీకి ఘోరమైన మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో గీతాంజలి విద్యాసంస్థల అధినేత వెంకటరమణ, జిల్లా లీగల్‌సెల్ లక్ష్మీనారాయణ, రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎద్దుల విజయసాగర్, బీసీ నాయకుడు తాటి సుబ్బరాయుడు, ఎస్సీ నాయకుడు మోడపోతుల రాము, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న హమాలీలు

రైల్వేకోడూరు(రూరల్) సెప్టెంబరు 25: సివిల్ సప్లైస్ హ మాలీల సమస్యలను పరిష్కరిం చాలని హమాలీ వర్కర్స్ యూని యన్ నాయకుడు మురళి డిమాండ్ చేశారు. బుధవారం సి విల్ సప్లైస్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కళ్లకు నల్ల రిబ్బన్ కట్టుకుని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ కూలి రేట్లు పెంచి 9 నెలల కావస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం దారుణమన్నారు. సివిల్ సప్లైస్ హమాలీల కూలి ధరలు పెంపు అమలు చేయడంతోపాటు, ఎరియర్స్‌తో కలిపి జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, వెంకటయ్య, వాసు, గోపి, గణేష్, రమణ, బాబు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: రాజంపేట సివిల్ సప్లై కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఎంఎస్‌రాయుడు, పట్టణ కార్యదర్శి సికిందర్, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. హమాలీ సంఘ నాయకులు సూర్యరాఘవేంద్ర, ప్రసాద్, కోదండరాముడు తదితరులు పాల్గొన్నారు.

'సంక్షోభంలోనూ సంక్షేమం ఘనత చంద్రబాబుదే..'



ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో చమర్తి జగన్‌మోహన్‌రాజు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 25 : సంక్షోభంలోనూ సంక్షేమం అందిస్తున్న ఘనత చంద్ర బాబుదేనని రాజంపేట టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్ మోహన్‌రాజు అన్నా రు. మండల పరిధిలోని ఒంటిమిట్టలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరు నెలల్లో సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేస్తామని భరోసా కల్పించారు. రాబోయే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు అందించేందుకు ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కల్లుగీత కార్మిక సంఘం మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య, అడ్వకేట్ రామదాసు, మోదుగుల నరసింహులు, మావిళ్ల ఈశ్వరయ్య, డాక్టర్ శివ, రేవిళ్ల బాలమునెయ్య, బాకరాపేట సర్పంచ్ ప్రతాప్‌నాయుడు, హరినాథ్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యలపై అవగాహన అవసరం

రైల్వేకోడూరు(రూరల్) సెప్టెంబ రు 25: విద్యార్థులకు విద్యలపై అవగాహన ఉండాలని గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ కె.పార్థ సార .థి తెలిపారు. బుధవారం ఓబులవారిపల్లి కస్తూర్బా గాంధీ బాలిక ల విద్యాలయ విద్యార్థినులకు పట్టణంలోని గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ కార్యాలయం లో వృత్తి విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్‌పై శిక్షణ ఇచ్చారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, పాలెంకోట పద్మావతి, ఓబులవారిపల్లి బాలికల విద్యాలయ అధ్యాపకురాలు లక్ష్మి ప్రసన్న సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి

రైల్వేకోడూరు(రూరల్) సెప్టెంబరు 25: భూ సమస్యలపై రాజీలేని పోరాటానికి సిద్ధం కావాలని బీకేఎంయు జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఆ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వచ్చేనెల మొదటి వారం నుంచి నియోజకర్గంలో అన్యాక్రాంతమైన భూములపై పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ మిగులు భూములు పేదలకు పంచాలని కోనేరు రంగారావు కమిటీ సిఫారసులు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వైసీపీని తరిమికొట్టాలని ధర్నా

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 25 : సనాతన ధర్మానికి హాని కలిగిస్తున్న వైసీపీని తరిమి కొట్టాలని మండల బీజేపీ నాయకులు రాజ గోపాల్‌రెడ్డి, చిన్‌రెడ్డి గోవర్ధన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. మండల కేంద్రం లో కూటమి నాయకులతో కలసి మంగళవారం వారు ధర్నా నిర్వహించారు. మండల బీజేపీ కార్యాలయం నుంచి రైల్వేస్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు చిన్నరెడ్డి, మండల సెక్రటరీ రామిరెడ్డి, బుచ్చిరెడ్డి, టీడీపీ నాయకులు శివయ్య నాయుడు, వంకన శివారెడ్డి, వంకన శ్రీకాంత్‌రెడ్డి, జనసేన నాయకుడు కటికం నాగేంద్ర, సుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ముమ్మరం చేయాలి

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 25 : గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ముమ్మరం చేయాలని ఎంపీడీవో విజయరావు ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులకు సంబంధించి మస్టర్లు, రికార్డులు సక్రమంగా ఉండేలా చూడాలని తెలిపారు. ఏపీవో, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటగా అరటికి గుర్తింపు

రైల్వేకోడూరు(రూరల్) సెప్టెంబరు 25: అరటిని ఖరీఫ్ పంటగా గుర్తించి బీమా అమలు చేయాలంటూ గత నెల మైసూరివారిపల్లెలో నిర్వహించిన గ్రామసభ సందర్భంగా రైతులు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఆయన అరటి పంటను ఖరీఫ్ పంటగా గుర్తించి బీమా అమలయ్యేలా చేశారంటూ రైతులు ప్రభుత్వానికి, ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

పండ్ల మొక్కలు పంపిణీ

ఒంటిమిట్ట, సెప్టెంబరు 25 : మండలంలోని ఏకశిల రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సుబ్బరాయుడు మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంతో పాటు, వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించుకునే సదుపాయాన్ని కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, కోఆర్డినేటర్ శంకరయ్య, సభ్యులు మౌనిక, రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న గ్రామస్తులు

సంబేపల్లె, సెప్టెంబరు 25: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు బాధ్యత లను మరింత పెంచిందని మండల విద్యాశాఖ అధికారులు రమాదేవి, శ్రీనివాసులు తెలిపారు. బుధవారం పెద్ద జంగంపల్లె జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు చక్రపాణి అధ్యక్ష తన ఆ పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు బోనేమురళీకుమార్ దంపతులను సన్మానించా రు. గ్రామ పెద్దలు చిన్నవీరస్వామి, మహాదేవ, శివప్రసాద్, స్కూల్ కమిటీ చైర్మన్ వీరేంద్ర, ఉపాధ్యాయులు, నాగేశ్వర, శరణయ్య, రమణయ్య, సుమంతసేన్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న తిప్పాయపల్లె ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాధాకృష్ణయ్యను బుధవారం బావికాడపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈవోలు చక్రధర్‌రాజు, నాగతిరుమలరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సన్మానించారు.

ఆటోమేటిక్ రోబో డిజైన్‌పై అవగాహన సదస్సు

రాజంపేట, సెప్టెంబరు 25 : రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీలో బుధవారం ఈసీఈ విభాగం తృతీయ సంవత్సరం విద్యార్థులకు టెక్నోట్రాన్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఎండీ వికాస్‌రెడ్డి నేతృత్వంలో రోబో డిజైన్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్‌ఎంవీ నారాయణ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ ఫహీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.: రాజంపేట అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపాల్ స్వర్ణలత ఆధ్వర్యంలో ఫార్మసిస్టు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరోనా సమయంలో ఫార్మసిస్టులు తమ ప్రాణాలకు తెగించి పని చేశారన్నారు.

విద్యుత్ శాఖ గ్రీవెన్స్‌డేకి 13 ఫిర్యాదులు


అర్జీలు స్వీకరిస్తున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు రూరల్, సెప్టెంబర్ 25: జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన విద్యుత్తు శాఖ గ్రీవెన్స్ డేకు 13 ఫిర్యాదులు వచ్చినట్లు ఆ శాఖ ఎస్‌ఈ సురేంద్రనాయుడు తెలిపారు. ప్రతి బుధవారం ప్రత్యేకంగా వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తాజాగా వచ్చిన అర్జీల్లో ఆరింటిని అప్పటికప్పుడే పరిష్కరించామన్నారు. మిగిలిన ఫిర్యాదులను త్వరలో పరిష్కరిస్తామన్నారు. తిరుపతి టౌన్‌లో 1, చిత్తూరు ఆపరేషన్ 4, చిత్తూరు రూరల్ 1, మదనపల్లి 1, పీలేరు 1, పుంగనూరు 5 ఫిర్యాదులు వచ్చాయన్నారు. అర్జీలను త్వరగా పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్ డేపై ఏఈలు, లైన్‌మెన్లు, విద్యుత్తు శాఖ సిబ్బంది విరివిగా ప్రచారం చేయాలన్నారు. చిత్తూరు ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో ఈఈ మునిచంద్ర అర్జీలు స్వీకరించారు.

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలో భారీగా బదిలీలు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 25:ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ భారీగా బదిలీలు జరిగాయి. చిత్తూరు జిల్లాలో 112 మంది, అన్నమయ్య జిల్లాలో 60 మంది, తిరుపతి జిల్లాలో 86 మంది బదిలీ అయ్యారు. ఒకే ప్రాంతంలో ఐదేళ్ల పాటు పనిచేసిన వారు 84 మంది బదిలీ అయ్యారు. 174 మంది అభ్యర్థన మేరకు కోరుకున్న ప్రాంతాలకు వెళ్లారు. మండల సమాఖ్య క్లస్టర్ కోఆర్డినేటర్లు 21 మంది, మస్టర్ బుక్ కీపర్లు 40 మంది , కమ్యూనిటీ కోఆర్డినేటర్లు 118 మంది, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు 76 మంది, ముగ్గురు డిస్ట్రిక్ ప్రాజెక్టు మేనేజర్లు బదిలీ అయ్యారు. ●తొమ్మిది మంది జూనియర్ అసిస్టెంట్లను వారి అభ్యర్థనపై బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ● కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయంలో 30మంది సీనియర్ అసిస్టెంట్లు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను వారి వ్యక్తిగత అభ్యర్థనపై బదిలీ చేశారు.

విశ్రాంత అధికారి పెన్షన్‌లో కోత

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 25: విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ పీఎన్ లక్ష్మీవెంకటేశ్వర్లుకు పెన్షన్‌లో ఏడాది కాలం పాటు ఐదు శాతం కోత విధిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన తవణంపల్లె మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని తేలడంతో ఈ చర్యలు తీసుకున్నారు.

ఫైళ్ల నిర్వహణలో అప్రమత్తం : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 25: కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని పలు విభాగాల్లో ఉద్యోగులు సక్రమంగా ఫైళ్ళు నిర్వహించడం లేదని మంగళవారం గుర్తించామని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేర పలు సూచనలు చేస్తూ బుధవారం సర్క్యులర్ జారీచేశారు. అక్టోబర్ 5న అన్ని కార్యాలయాల్లో మళ్లీ ఆకస్మిక తనిఖీ చేపడతామన్నారు. ఆఫీసు సూపరింటెండెంట్లు, ఉద్యోగులు ఇకపై అన్ని ఫైళ్ళను పద్ధతి ప్రకారం జవాబుదారీతనంగా ఉంచుకోవాలన్నారు. క్యాబిన్లలో, కార్యాలయ గదుల్లో, ఫైళ్ళ ర్యాక్స్‌లో పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యాలయాల గోడలపై అంటించిన అనవసర పోస్టర్లు, బ్యానర్లు, పెట్టెలు, వాడకంలోలేకుండా వృథాగా పడివున్న ఎలక్ట్రానిక్ వస్తువులు, వీల్‌చైర్లు అక్కడి నుంచి తొలగించాలన్నారు. సూచనలను పాటించకపోతే చర్యలు తీసుకుంటానని కలెక్టర్ ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

రేపిస్టుపై పోక్సో కేసు నమోదు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 25: మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు ....పుంగనూరు మండలంలోని నేతిగుట్లపల్లె పంచాయతీ అక్కింవారిపల్లెకు చెందిన విజయభాస్కర్ ఓ మైనర్ బాలికపై అత్యాచారం చేయడంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష దరఖాస్తులకు గడువుపెంపు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 25: జవహర్ నవోదయ విద్యాలయ 6వ తరగతి ప్రవేశానికి ఎంపిక పరీక్షలు దరఖాస్తులను గడువును అక్టోబరు 7వ తేదికి పెంచుతున్నట్లు అన్నమయ్య జిల్లా వలసపల్లి జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ బి.గోవిందరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు నవోదయ.జీవోవి.ఇన్‌లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాల్లో మార్పులు చేసేందుకు చివరి తేదీ అక్టోబరు 8, 9వ తేదీలలో అవకాశం ఉందన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

10 మంది సీఐల బదిలీ

● నలుగురు వీఆర్‌కు రిపోర్టు చేసుకోవాలని డీఐజీ ఆదేశాలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 25: అనంతపురం రేంజ్ పరిధిలో దాదాపు 16 మంది సీఐలు బదిలీ కాగా అందులో తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన 10 మంది ఉన్నారు. వీరిలో నలుగురిని వీఆర్‌కు పంపుతూ అనంతపురం రేంజ్ డీఐజీ షీమూషీ బుధవారం ఉదయం ఉత్తర్వులు జారీ చేశారు. వీరందరూ తక్షణం రిలీవ్ అయి వారి వారి స్థానాల్లో చేరాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. చిత్తూరు వీఆర్‌లో ఉన్న మునస్వామిని పుత్తూరు రూరల్‌కు, అక్కడున్న ఎం.భాస్కరనాయక్‌ను వీఆర్‌కు, ప్రస్తుతం తిరుపతి వీఆర్‌లో ఉన్న పి.శ్రీరాములను డీటీఆర్‌బీకి, తిరుపతి ట్రాఫిక్‌లో ఉన్న కె.శ్రీనివాసులను తిరుపతి ఈస్ట్ సర్కిల్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న చిన్న పెద్దయ్యను శ్రీసిటీకి, తిరుపతి ఈస్ట్ సీఐ మహేశ్వర రెడ్డిని వీఆర్‌కు, డీటీసీ తిరుపతిలోని ఎ.శ్రీరాముడును తిరుమల టూ టౌన్‌కు, అక్కడున్న సత్యనారాయణను వీఆర్‌కు, చిత్తూరు వీఆర్‌లో ఉన్న కృష్ణమోహన్‌ను పూతలపట్టుకు బదిలీ చేశారు. దీంతో జిల్లాలో సీఐల బదిలీలు దాదాపు పూర్తయ్యాయి.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.45కోట్లు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.1,45,87,352 వచ్చింది. ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద హుండీ లెక్కింపు జరిగింది. ప్రధాన హుండీలతో పాటూ పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా 68 గ్రాముల బంగారం, 421.200కిలోల వెండి, విదేశీ కరెన్సీ 3,452 వచ్చింది. 28 రోజుల వ్యవధిలో ఈ ఆదాయం వచ్చినట్టు ఈవో చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరెంటు కష్టాలు!

డబ్బు కట్టినా వ్యవసాయ సర్వీసులివ్వరు
ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోయినా పట్టించుకోరు

పలమనేరు, సెప్టెంబరు 25 : వ్యవసాయ సర్వీసులకోసం డబ్బులు కట్టి నెలలు గడిచిపోతున్నా పట్టించుకునే దిక్కులేదు. ట్రాన్స్‌ఫార్మర్లకోసం డబ్బులు కట్టి సంవత్సర కాలంగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా స్పందించేవారు లేరు. దీంతో రైతులు ఏమి చేయాలో, తమగోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. పలమనేరు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని పలమనేరు, గంగవరం, బైరెడ్డి పల్లి మండలాల రైతులు వర్షాభావం కారణంగా బోరుబావుల పైనే వ్యవసాయం చేయాల్సి వుంది. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే క్షేత్రస్థాయి సిబ్బందికి ఎంతో కొంత ముట్టజెప్పి రైతులే ఆటోల్లో వాటిని తీసుకెళ్లాల్సి వస్తోంది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా విద్యుత్ స్తంభాలు కూలిపోయినా నెలల తరబడి పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.వ్యవసాయ సర్వీసులు మంజూరై రైతులు డబ్బులు చెల్లించినా మెటీరియల్ లేదన్న సాకులు చెబుతూ విద్యుత్ సిబ్బంది కాలయాపన చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.విద్యుత్ స్తంభాలను కూడా కార్యాలయాల వద్ద కాకుండా అధికారులు ఎక్కడ దించితే అక్కడినుంచీ పొలాల వద్దకు వేలాది రూపాయలు వెచ్చించి తరలించుకోవాల్సి వస్తోందని రైతులు విమర్శిస్తున్నారు.

ఏడాదికి పైగా ప్రదక్షిణ




సుబ్రమణ్యం - సర్వీసుకోసం సుబ్రమణ్యం చెల్లించిన మొత్తానికి విద్యుత్ శాఖ రసీదు

గంగవరం మండలం కలగటూరు గ్రామానికి చెందిన దళిత రైతు సుబ్రమణ్యం వ్యవసాయ సర్వీసు కోసం గత ఏడాది జూన్‌లో రూ. 12400కట్టి దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్నుంచీ వందల సార్లు గంగవరం ఏఈ కార్యాలయం చుట్టూ తిరిగినా వ్యవసాయ సర్వీసు ఇవ్వనేలేదు.ఏఈ నాలుగునెలల క్రితం సస్పెండ్ కావడంతో సుబ్రమణ్యం తన ప్రదక్షిణా కార్యక్రమాన్ని ఏడీఈ కార్యాలయం వద్దకు మార్చాడు.అక్కడికి నాలుగు నెలలుగా తిరుగుతున్నా మెటీరియల్ లేదంటూ తిప్పుతూనే వున్నారు.ఒక విద్యుత్ స్తంభం అవసరముండగా దాన్ని కీలపట్ల గ్రామ సమీపంలో నిల్వవుంచిన స్థలం నుంచి తరలించుకుపొమ్మని చెప్పారు.దీంతో సుబ్రమణ్యం గత్యంతరం లేక విద్యుత్ స్తంభాన్ని 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న కీలపట్లనుంచి కలగటూరుకు ట్రాక్టరుకు బాడుగ ఇచ్చి తరలించాల్సి వచ్చింది.మిగిలిన మెటీరియల్ రాలేదని ఇప్పటికీ తిప్పుతూనే ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కోసం నెలల తరబడి...


రత్నారెడ్డి

పలమనేరుకు 15 కిలో మీటర్ల దూరంలోని నాలుగురోడ్ల వద్ద ఉన్న తన పొలంలో వేసిన బోరు కోసం 15 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని రత్నారెడ్డి దరఖాస్తు చేసుకున్నారు.దాదాపు 8నెలల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ కోసం అధికారులు రూ. 18వేలు కట్టించుకున్నారు.నెలల పర్యంతం తిప్పుకొని చివరకు కూర్నిపల్లి సబ్‌స్టేషన్ వద్ద నిల్వవుంచిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తెచ్చుకోమన్నారు.గత్యంతరం లేక ఆటోలో 20కిలోమీటర్ల దూరంలోని కూర్నిపల్లి వద్దకు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌ను రత్నారెడ్డి పొలం వద్దకు తెచ్చుకు వెళ్లాడు.ట్రాన్స్‌ఫార్మర్ ఇచ్చి నెలలు గడుస్తున్నా దాన్ని బిగించేందుకు కావాల్సిన మెటీరియల్ స్టాకు లేదని ఇంకా తిప్పుతూనే వున్నారు.


రత్నారెడ్డి ఇంటి వద్ద మూడునెలలుగా పడివున్న ట్రాన్స్‌ఫార్మర్



బాధితులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి ప్రభావతి - చికిత్స పొందుతున్న రోగులు

కొత్తగొల్లపల్లెలో అతిసార

● 15 మందికి చికిత్స

తవణంపల్లె, సెప్టెంబరు 25: మండలంలోని నల్లిశెట్టిపల్లె పంచాయతీ కొత్తగొల్లపల్లెలో అతిసార విజృంభించింది. కలుషిత తాగునీరు తాగడంతో పలువురు వాంతులు, విరేచనాలతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మంగళవారం ఐదుగురికి సోకగా బుధవారం మరో పదిమంది ఈ వ్యాధి బారినపడ్డారు. దీంతో జిల్లా వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. వైద్య సిబ్బంది గ్రామానికి చేరుకుని అతిసార నివారణ చర్యలు చేపట్టారు. రక్షిత మంచి నీటి ట్యాంక్ ద్వారా సరఫరా అయ్యే నీరు కలుషితం కావడం వల్ల వ్యాధి ప్రబలినట్లు తెలుస్తోంది. గ్రామానికి చెందిన కన్నయ్య, అమర, చిరంజీవి, శరవణ కుమార్, లిల్లి, అనూష, మునికృష్ణ, రమీలా, మణి, గురవయ్య, భార్గవిలతో పాటు మరికొందరికి వైద్య సిబ్బంది చికిత్స అందిస్తున్నారు. కొత్తగొల్లపల్లెలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి ప్రభావతి, టీకాల అధికారి హనుమంతరావు, మలేరియా అధికారి అనిల్‌కుమార్, డీపీవో లక్ష్మి, శ్రీవాణిలు సందర్శించారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు.

టైక్వాండో పోటీల్లో గంగవరం కేజీబీవీ ప్రతిభ

● అండర్-19లో 6, అండర్-17 లో 3 బంగారు పతకాలు కైవసం


బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులు

గంగవరం, సెప్టెంబరు 25: ఉమ్మడి చిత్తూరు జిల్లా టైక్వాండో అండర్-19, అండర్-17 వెయిట్ కేటగిరి పోటీల్లో గంగవరం కేజీబీవీ విద్యార్థినులు 9 బంగారు పతకాలు కైవసం చేసుకున్నట్లు ఎస్వో రోహిణి తెలిపారు. బుధవారం తిరుపతిలోని ముత్యాలరెడ్డిపల్లె జడ్పీ హైస్కూల్‌లో టైక్వాండో అండర్-19, అండర్ -17, అండర్-14 విభాగాల్లో వివిధ వెయిట్ లిఫ్టింగ్ కేటగిరీల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గంగవరం కేజీబీవీ విద్యార్థినులు అండర్-19, అండర్-17 విభాగాల్లో హోరాహోరీగా తలపడ్డారు. ఫైనల్లో గెలుపొందిన గంగవరం విద్యార్థినులు అండర్ -19 విభాగంలో ఇంటర్ సీఈసీ సెకండియర్‌కు చెందిన కీర్తన, యం.జాహ్నవి, ఇంటర్ సీఈసీ ఫస్ట్ ఇయర్‌కు చెందిన కె.మౌనిక, పి.హిమాని, కె.నేత్రావతిలతో పాటు 10వ తరగతికి చెందిన జె.ఎస్. హేమలత బంగారు పతకాలు సాధించారు. అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ కేటగిరీలో 10వ తరగతికి చెందిన ఆర్.చందన, యస్.లక్ష్మీదేవి, 9వ తరగతికి చెందిన ఎం.మాధవి బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు.అండర్-19లో ఆరు బంగారు పతకాలు, అండర్-17లో మూడు బంగారు పతకాలతో కలిపి మొత్తం 9 బంగారు పతకాలు సాధించి విజయఢంకా మోగించారు.అండర్-19 విభాగంలో బంగారు పతకాలు సాధించి ప్రథమస్థానంలో నిలిచిన కీర్తన, యం.జాహ్నవి, కె.మౌనిక, పి.హిమాని, కె.నేత్రావతి, జేఎస్ హేమలత అక్టోబరు 3, 4 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీలకు ఎంపికయ్యారని, అండర్-17 విభాగంలో బంగారు పతకాలు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన ఆర్.చందన, యస్.లక్ష్మీదేవి, యం.మాధవి అక్టోబరు 6, 7 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఒకేసారి 9 బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులను, వారిని తీర్చిదిద్దిన కేజీబీవీ పీఈటీ తరణుమ్ తాజ్‌ను, ఎస్వో రోహిణి, ఉపాధ్యాయులు అభినందించారు.

జడ్పీ పూర్వ సీఈవోకు వీడ్కోలు


గ్లోరియాను సన్మానిస్తున్న జడ్పీ చైర్మన్, సీఈవో తదితరులు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 25: జడ్పీ పూర్వ సీఈవో గ్లోరియాకు జడ్పీ చైర్మన్, జడ్పీ సీఈవో, ఎంపీడీవోలు జడ్పీ ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. బుధవారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో పలువురు అధికారులు మాట్లాడుతూ ఆమె సేవలను కొనియాడారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై తనదైన ముద్రవేశారన్నారు. కింది స్థాయి ఉద్యోగులతో స్నేహభావంతో ఉండేవారన్నారు. అనంతరం గ్లోరియా మాట్లాడుతూ జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఉద్యోగులు తనకు మంచి సహకారం అందించారన్నారు. చిత్తూరులో పనిచేయడం తనకు ధైర్యాన్నిచ్చిందన్నారు. ఎక్కడైనా పనిచేయగలిగే సామర్థ్యం వచ్చిందన్నారు. జడ్పీ సీఈవో రవి కుమార్‌నాయుడు, చైర్మన్ శ్రీనివాసులు, వైస్‌చైర్మన్ రమ్య, ఎంపీడీవోలు, డీఎల్‌డీవోలు, ఉద్యోగులు కలిసి ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకుడు చెంచురత్నం, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీకి సత్కారం

చిత్తూరు (సెంట్రల్): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీగా పనిచేసి మాతృశాఖకు వెళుతున్న డీఎంకే తులసీకి జిల్లా సమాఖ్య మహిళా సభ్యులు ఘనంగా వీడ్కోలు పలికారు. బుధవారం స్థానిక జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో జిల్లా అధ్యక్షురాలు సుకన్య అధ్యక్షతన జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో డీపీఎంలు, ఏపీఎంలు, జిల్లా సమాఖ్య ప్రతినిధులు, మహిళా సంఘం సభ్యులు సత్కరించారు.

తిరుపతి కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల వాయిదా

తిరుపతి, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలను పరిపాలన కారణాల (అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్)వల్ల వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ మౌర్య ప్రకటించారు. కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌కు గడువు తీరిపోయిన నేపథ్యంలో ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూట్నీ, విత్‌డ్రా ప్రక్రియ ముగించుకుని వచ్చే నెల 4న ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరుమల పర్యటన, శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఎన్నికలను వాయిదా వేయాలని కూటమి పార్టీ కార్పొరేటర్లతో పాటు పలువురు వైసీపీ కార్పొరేటర్లు మంగళవారం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయం తెలుసుకున్న మరికొంత మంది వైసీపీ కార్పొరేటర్లు బుధవారం నామినేషన్లు వేసేందుకు నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చారు. కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో మేయర్ డాక్టర్ శిరీషతో కలసి కార్యాలయం ముందు కొద్దిసేపు నిరసన తెలిపారు. ఓడిపోతామన్న భయంతోనే ఎన్నికలు నిర్వహించేందుకు అధికార పార్టీ వెనకడుగు వేస్తోందని విమర్శించారు. ఇంతలోనే ఎన్నికలను వాయిదా వేస్తున్నట్టు కార్పొరేటర్లకు వాట్సప్‌లో సవరణ నోటిఫికేషన్ రావడంతో అక్కడ నుంచి వెనుదిరిగారు. కాగా వైసీపీ స్థానిక నాయకత్వ ఆదేశాలకు వ్యతిరేకంగా ఎన్నికలు వాయిదా వేయాలని కోరిన ఆ పార్టీ కార్పొరేటర్లపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఎమ్మెల్యే చొరవతో సమస్య పరిష్కారం


కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 25: ఎమ్మెల్యే గురజాల జగన్ చొరవతో దిగువమాసాపల్లి చెరువు సమస్యను కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిష్కరించారు. చిత్తూరు-తచ్చూర్ హైవే నిర్మాణంలో భాగంగా దిగుమాసాపల్లి చెరువు మొరవ కాలువను హైవే అధికారులు గోడ నిర్మించి మూసివేశారు. గోడ కారణంగా చెరువు నిండితే నీరు వెలుపలికి వెళ్లేందుకు దారి లేక గ్రామంపై వస్తుందని గ్రామస్థులు అనేకమార్లు అధికారులకు విన్నవించారు. తాజాగా వీరు తమ సమస్యలను ఎమ్మెల్యే గురజాల దృష్టికి తీసుకొచ్చారు. ఆయన కలెక్టర్‌తో మాట్లాడారు. దీంతో వెంటనే గోడను తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు.

శ్రీవారి ప్రసాదాలు అపవిత్రం చేసిన వారికి పుట్టగతులుండవ్


జగన్, భూమన, వైవీ, ధర్మారెడ్డి చిత్రపటాలకు పాలుపోసి అగరబత్తులు తిప్పుతున్న మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్

పుంగనూరు, సెప్టెంబరు 25: శ్రీవారి లడ్డూ ప్రసాదాలను అపవిత్రం చేసి ప్రపంచంలోని స్వామి భక్తుల మనోభావాలు దెబ్బతీసిన వారికి పుట్టగతులుండవని, నిందితులను కఠినంగా శిక్షించాలని పుంగనూరు మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం పుంగనూరు అన్నక్యాంటీన్ ఎదుట మాజీ సీఎం జగన్, టీటీడీ మాజీ ఛైర్మన్లు భూమన కరుణాకరరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, మాజీ ఈవో ధర్మారెడ్డిల చిత్రపటాలకు పూలు వేసి పాలు క్రియలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాలను కల్తీ నెయ్యి, ఆవు, పంది కొవ్వు, వ్యర్థాలతో గత వైసీపీ ప్రభుత్వం మలినం చేసి తీవ్రమైన అపచారానికి పాల్పడిందన్నారు. ఈఘటనకు కారకులైన జగన్మోహన్‌రెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, వైవీ.సుబ్బారెడ్డి, ధర్మారెడ్డిల దిష్టిబొమ్మలను ఆదివారం ఊరేగిస్తూ దహనం చేయడంతో మూడోరోజు వారి ఫొటోలకు పాలు పోసి, అగరబత్తులు తిప్పినట్లు వివరించారు. వీరికి కఠిన శిక్షలు వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో హిందూ పరిరక్షణ సమితి ప్రతినిధి హరిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమలలో భారీ వర్షం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 25: ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకు 23 మండలాల్లో తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా సోమలలో 56.4, అత్యల్పంగా పుంగనూరులో 1.2 మిమీ వర్షపాతం నమోదయ్యింది. మండలాలవారీగా.. కార్వేటినగరంలో 29.2, చిత్తూరు అర్బన్‌లో 25.8, యాదమరిలో 22.4, ఐరాలలో 19.2, సదుంలో 18.4, పులిచెర్లలో 18.0, గంగాధరనెల్లూరులో 11.6, బంగారుపాళ్యంలో 11.4, విజయపురంలో 10.8, గుడిపాలలో 10.2 మి.మీటర్ల వర్షం కురిసింది.

10లోగా సీసీ రోడ్ల పనులు ప్రారంభించాలి

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 25: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రస్తుత ఏడాది మంజూరైన 1142 సీసీ రోడ్ల నిర్మాణ పనులు వచ్చేనెల 10వ తేదీలోగా ప్రారంభించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం రాత్రి కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో పంచాయతీరాజ్ శాఖ ద్వారా జరుగుతున్న సీసీ రోడ్లు, ఏపీ ల్యాడ్స్ ద్వారా చేపట్టిన పనుల పురోగతిపై ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 10లోగా పనులు ప్రారంభించకపోతే రద్దుచేసి ఇతర మండలాలకు కేటాయిస్తామని చెప్పారు. కొనసాగుతున్న పనులకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశి, ఎస్ఈ శంకర్ నారాయణ, ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఊపిరి ఉన్నంత వరకు ప్రజాసేవలోనే..





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి, రామసముద్రంలో షాజహాన్‌బాషా, రైతులకు ఉలవలను పంపిణీ చేస్తున్న జయచంద్రారెడ్డి

- ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం, సెప్టెంబరు 25: ఆదరించి గెలిపించిన ప్రజల కోసం తన ఊపిరి ఉన్నంత వరకు ప్రజాసేవకే అంకితమవుతానని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వాల్మీకిపురం తహసీల్దార్ కార్యాలయం, మండలంలోని చింతపర్తిలలో టీడీపీ ప్రభుత్వం 100రోజులు పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు కష్టకాలంలో సైతం రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. వాల్మీకిపురంలో తన అన్న సీఎంగా ఉన్న రోజుల్లో వాల్మీకిపురంలో 100పడకల ప్రభుత్వాస్పత్రి మంజూరు చేయిస్తే అది కాస్త 50 పడకలకు తగ్గించి చేసిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాలలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, డాక్టర్ ఫైరోజాబేగం, తహసీల్దార్ పామిలేటి, ఎంపీడీవో మనోహర్‌రాజు, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, పులి సత్యరెడ్డి, సర్పంచ్ మహిత, వీవీ నారాయణ, గాంధీపేట రమణ, చంద్రమౌళి, కోసూరి రమేష్, రాజేంద్రాచారి, విజయ్‌కుమార్‌రెడ్డి, మురళి, అధ్యక్షులు సయ్యద్‌బాషా, టీడీపీ జనసేన, బీజేపీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

రామసముద్రం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే ప్రజలు మెచ్చిన ప్రభుత్వంగా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె గ్రామంలో బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం గ్రామసభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో అవినీతి, అక్రమాలకు బటన్ నొక్కడంతో రాష్ట్రంపై రూ.14 లక్షల కోట్లు అప్పులు మిగిల్చారని ఎద్దేవా చేశారు. అనంతరం జనసేన అధినేతలు దారం అనిత, రామాంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల వద్దకే పాలన దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు, మదనపల్లె టౌన్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు విద్యాసాగర్, రాటకొండ మధుబాబు, చిన్నప్ప, తిమ్మప్ప, వెంకటేష్, రామచంద్ర, రాజారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రాజేష్, శివశంకర్, కృష్ణంరాజు, ప్రదీప్‌రెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు ఆనందకుమార్‌నాయుడు, వెంకటరమణ, అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను రైతులకు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నాయకుడు దాసరిపల్లె జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక పెద్దతిప్పసముద్రంలోని రైతుసేవా కేంద్రంలో రైతులకు ఉలవల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు వర్షాభావంతో వేరుశెనగ పంటను సాగు చేయలేక పోతున్న కారణంగా ప్రత్యామయ పంటగా ప్రభుత్వం ఉలవలు, మొక్కజొన్న విత్తనాలను రైతులకు సబ్సిడీ ధరలతో అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి ప్రేమలత, టీడీపీ సీనియర్ నాయకులు కట్టా సురేంద్ర నాయుడు, సంపతికోట కిట్టన్న, చంద్రమోహన్‌రెడ్డి, దేవప్పకోట సురేష్, మడుమూరు నవీన్, బందార్ల వెంకట్రమణ, టైలర్ రామాంజులు, భజంత్రి రామచంద్ర, రాము, కార్యం సుబ్రమణ్యం, మద్దయ్యగారిపల్లె నరసింహులు, గుగ్గిళ్లపల్లె బాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కురబలకోట: ప్రజా సంక్షేమం- రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుకు రెండు కళ్లని పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందివ్వడమే సీఎం చంద్రబాబు ధ్యేయమని నియోజకవర్గ టీడీపీ నేత జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నందిరెడ్డిగారిపల్లెలో గ్రామ సచివాలయంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా రైతులకు ఉలవలను అందజేశారు. తదనంతరం కురబలకోట జడ్పీ హైస్కూల్‌లో మండలస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హరినారాయణ, తహసీల్దార్ తపస్విని, రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, తంబళ్లపల్లె నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, జంగా రాఘవరెడ్డి, గుత్తికొండ త్యాగరాజ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా పరమేశ్వర్‌రెడ్డి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 25: మండల ఎంపీడీవోగా పరమేశ్వర్‌రెడ్డి నియమించిననట్లు ఈవోపీఆర్‌డీ చలపతిరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గతంలో నిమ్మనపల్లిలో ఎంపీడీవోగా పని చేసిన శేషగిరిరావు అనారోగ్య కారణాలతో విధుల్లో చేరలేదు. అప్పటి నుండి ఇన్‌చార్జి ఎంపీడీవోగా ప్రభుత్వం రమేష్‌ను నియమించిదన్నారు. దీంతో కలకడలో ఎంపీడీవో పని చేస్తున్న పరహేశ్వర్‌రెడ్డి నిమ్మనపల్లి బదిలీ అయ్యారని తెలిపారు.

చెట్టుకొమ్మ తెచ్చిన తంటా

- ముగ్గురిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 25: చెట్టుకొమ్మ తెచ్చిన తంటా కారణంగా ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మూష్టూరు పంచాయతీ పారేసువారిపల్లికి చెందిన రామకృష్ణ వ్యవసాయ పొలంలో వున్న వేప చెట్టును అదే గ్రామానికి చెందిన నరసింహులు, ఇతని ఇద్దరు భార్యలు కలసి నరికివేశారు. దీంతో రామకృష్ణ వ్యవసాయ పొలంలో వున్న వేపచెట్లు నరకడంపై వారిని ప్రశ్నించాడు. అదే సమయంలో ముగురు కలసి రామకృష్ణపై దాడి చేసి గాయపరిచారు. రామకృష్ణ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

రామసముద్రం, సెప్టెంబరు 25: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె పంచాయతీ ఎగువనల్లప్ప గారి పల్లెకు చెందిన టి.వెంకటరమణ కర్ణాటక మద్యం 85 టెట్రా ప్యాకెట్లు అమ్మడానికి తీసుకువస్తుండగా అరెస్టు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి'

పెద్దమండ్యం, సెపెంబరు 24: ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తహసీల్దార్ సయ్యద్ ఆహ్మద్, ఎంపీడీవో శ్రీధర్‌రావు పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాల్లో భాగంగా పెద్దమండ్యంలో ఆయా అధికారులు, ఉపాధ్యాయులు, స్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్లు, పంచాయతీ కార్యదర్శులు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పోలీసులకు నగదు రివార్డు

కురబలకోట, సెప్టెంబరు 25: గంజాయి కేసులో నిందితులను పట్టుకున్న 6మంది పోలీసులకు మదనపల్లె డీఎస్పీ దర్బార్ కొండయ్యానాయుడు బుధవారం నగదు రివార్డులను అందజేశారు. మండలంలోని ముదివేడు పోలీస్టేషన్ పరిధిలో 3కిలోల అక్రమ గంజాయిని స్వాధీనం చేసుకుని, 14 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ చూపిన పోలీసులు రవి, జమీల్, శ్రీనివాసులు, మధుకర్‌రెడ్డి, ప్రతాప్, సుధాకర్‌లకు ఒక్కొక్కరికి రూ.1500 రివార్డులను అందజేశారు.

కురబలకోట ఆర్‌ఐ బదిలీ

కురబలకోట, సెప్టెంబరు 25: కురబలకోట ఆర్‌ఐ సుగుణను బదిలీ చేస్తూ కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఆమెను వాల్మీకిపురానికి బదిలీ చేయగా పలమనేరు ఆర్‌ఐగా పనిచేస్తున్న బాలసుబ్రమణ్యంను ఇక్కడికి బదిలీ చేశారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

నిమ్మనపల్లి, సెప్టెంబరు 25: మండలంలోని తవళం గ్రామం కుమ్మరపల్లిలో పేకాట ఆడుతున్న నలుగురిని పట్టుకొని వారి వద్ద నుంచి రూ.3500లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మదనపల్లెటౌన్, సెప్టెంబరు 25: కర్నూలులో జరిగిన అంతరాష్ట్ర కరాటే పోటీల్లో మదనపల్లె విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రెండు రోజుల క్రితం కర్నూల్ నగరం పుష్ప రాజ్ హాల్లో గొజుర్యూ కరాటే, మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో 6వ అంతరాష్ట్ర కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు కటా, కుమితి విభాగాల్లో 15 బంగారు పతకాలు, 10 రజత పతకాలు, 11 కాంస్య పతకాలు సాధించినట్లు శాన్ సై జగదీష్‌కుమార్ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను కరెస్పాండెంట్ అమృత, డైరెక్టర్ శ్రీదేవి, ప్రిన్సిపాల్ షెహనాజ్ అభినందించారు.

ఉపముఖ్యమంత్రి ప్రాయశ్చిత దీక్షకు సంఘీభావం



టెంకాయలు కొడుతున్న జనసేన నాయకులు

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 25: ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత దీక్షకు సంఘీభావంగా స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో 101 టెంకాయలు కొట్టి జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్ బుధవారం సంఘీభావం తెలిపారు. ఇందులో భాగంగా తదుపరి కార్యాచరణ కోసం శని, ఆదివారాల్లో పట్టణంలోని పురప్రముఖులు, సంఘసేవకులు, వివిధ రాజకీయ పార్టీలతో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అమరనారాయణ, సందీప్‌రెడ్డి, ఆంజనేయులు, చంద్ర, విశ్వనాథ్, లక్ష్మీపతి, చిరంజీవి రమణారెడ్డి, రెడ్డెప్ప, నాగేంద్ర, దేవేంద్ర, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోండి

తంబళ్లపల్లె, సెప్టెంబరు 25: మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి ఎదుట చేపడుతున్న అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని తంబళ్లపల్లె కూటమి నేతలు కోరారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి వెంకట్రామయ్యకు కూటమి నేతలు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకురాలు సిద్ధమ్మ, పురుషోత్తం, పార్లమెంట్ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోమశేఖర్, సుధాకర్‌రెడ్డి, ధనశేఖర్, తెలుగు యువత నరసింహులు, నాగేంద్ర, శంకర్‌రెడ్డి, శ్రీనివాసులు, రమణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



పీలేరు, సెప్టెంబరు 25: పీలేరు మండలం ముడుపులవేముల పంచాయతీ వేంకటాద్రి ఇండ్ల వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పి.శివకుమార్(30) అనే యువకుడు మృతి చెందాడు. ముడుపులవేముల పంచాయతీ విద్యానగర్‌కు చెందిన శివకుమార్, వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో మంగళవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో పీలేరుకు బయలుదేరాడు. వేంకటాద్రి ఇండ్ల సమీపంలో పీలేరు నుంచి కేవీపల్లె వైపు వెళుతున్న ట్రాక్టర్ ఢీకొనడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి ప్రాణాలు విడిచాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పండిట్ దీన్‌దయాళ్‌కు మాజీ సీఎం నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

కలికిరి, సెప్టెంబర్తు 25: పండిట్ దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా కలికిరి బీజేపీ కార్యాలయంలో మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి దేశ సమగ్రత కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కిరణ్‌కుమార్ రెడ్డితో పాటు మదనపల్లె, తంబళ్లపల్లె సీనియర్ బీజేపీ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి, ముమ్మడి కృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్రమణ, మహదేవ నాయుడు, సుధారాణి, నాగేంద్ర నాయుడు, భాస్కర్‌రెడ్డి, అశోక్, పి.ఎం.ఖాన్, మిలిటరీ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పండిట్ దీన్‌దయాళ్ జయంతి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 25: పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బీజేపీ రూరల్ అధ్యక్షుడు పచ్చిపాల వసంతకుమార్ ఆధ్వర్యంలో బుధవారం మదనపల్లె రూరల్ మండలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్‌దయాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్టీ మెర్చ స్టేట్ రీజనల్ కో-ఆర్డినేటర్ పి.బొజ్జప్ప, రూరల్ అధ్యక్షుడు పి.వసంతకుమార్, జనరల్ సెక్రటరీ జి.గంధర్వరెడ్డి, రామిరెడ్డిగారిపల్లె వెంకటరమణారెడ్డి, పూజారి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను సొసైటీ కాలనీ, బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు బర్నేపల్లె రవికుమార్ మాట్లాడుతూ అంత్యోదయకు పేదల సేవకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యం బీజేపీ పార్టీకి ప్రేరణ ఇస్తోందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లె ప్రశాంత్ మాట్లాడుతూ భారతీయ సాంస్కృతిక వైభవం వెనుక మహర్షుల కృషి ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల కృష్ణమూర్తి, కోసూరి భవాని, పూల నాగరాజు, భువనేశ్వర్ సత్య, కొండయ్య, సంతోష్, గణపతి, వెంకటేస్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 25: మండల కేంద్రమైన పీటీఎంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా, కమనీయంగా నిర్వహించారు. పీటీఎంకు చెందిన ఆధ్యాత్మిక వేత్త సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం కర్ణాటక రాష్ట్రానికి చెందిన వేదపండితులు కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ కళ్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

భోజనంలో నాణ్యత పాటించండి: ఎంఈవో

కురబలకోట, సెప్టెంబరు 25: మధ్యాహ్న భోజనంతో నాణ్యత పాటించాలని ఎంఈవో ఎంఈవో ద్వారకనాథ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చింతమాకులపల్లె పాఠశాలను ఆస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనానికి సంబంధించి ఎటువంటి సమస్య రాకూడదని, కాగా విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి వారి అర్థమయ్యే సరళ భాషలో బోధనలు చేయాలన్నారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల నమోదుకు సంబంధించి రికార్డులను పరిశీలించారు.

పీఎం స్కాలర్‌షిప్పులు మంజూరు

కురబలకోట, సెప్టెంబరు 25: మండలంలోని అంగళ్ల సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులకు పీఎం జాతీయస్థాయి స్కాలర్‌షిప్పులు మంజూరైనట్లు బుధవారం ప్రిన్సిపాల్ యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో సీఎస్ఈ ద్వితీయ, తృతీయ సంవత్సరానికి చెందిన సందీప్, తేజ్‌దీప్, శివకుమార్, లక్షలకు ఒక్కొక్కరికి రూ.30,000 చొప్పున, సెంట్రల్ సెక్టార్ స్కీం కింద గాయత్రి, వసుంధరలకు రూ.12 వేల నుంచి స్కాలర్‌షిప్పులు మంజూరయ్యారన్నారు. కాగా విద్యార్థుల ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు మంజూరయ్యాయని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరెస్పాండెంట్ ఎస్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, వైస్ ప్రిన్సిపాల్ యువరాజ్, అత్తర్ సమీనాఖాన్, మౌలాలి తదితరులు అభినందించారు.

చెట్లను నరికేశారని పోలీసులకు ఫిర్యాదు

పెద్దతిప్పసముద్రం, సెప్టెంబరు 25: మండలంలోని పులికల్లు గ్రామం జగడంవారిపల్లె రెవెన్యూ పరిధి బొంతలవారిపల్లెలోని సర్వేనంబర్ 14-1లో 35 సెంట్ల భూమిలో, సర్వే నంబరు 13లో కాలువ పోరంబోకు భూమిలోను బొంతలవారిపల్లెకు చెందిన గుడె మహేష్‌రెడ్డి చెట్లను అక్రమంగా నరికివేసి భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు రెవెన్యూ అధికారులకు నరసింహారెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. కాగా రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా చెట్లను నరికేయడమే కాకుండా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని, తగుచర్యలు తీసుకోవాలని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సృజనాత్మక శక్తిని పెంచేందుకే ట్యాలెంట్ టెస్టులు

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 25: విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంచేందుకు ట్యాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు హరింద్రనాథ్ శర్మ అన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రతి ఏడాది నిర్వహిస్తున్న చెకుముకి టెస్టులో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు. మదనపల్లె డివిజన్‌లో దాదాపు ఆరువేల మంది విద్యార్థులు అన్ని మండలాల్లో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో జయచంద్ర, కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, వెంకటరమణలు కృషి చేశారన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కురబలకోట, సెప్టెంబరు 25: రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రిన్సిపల్ రఘునాథ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అంగళ్ల సమీపంలోని విశ్వం డిగ్రీ కళాశాలలో మదనపల్లెకు చెందిన ఎస్‌వీఎస్ ఛారిటబుల్ ట్రస్టు వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 89 మందికి పైగా రక్తదానం చేశారు.



34 మంది ఎంపీడీవోల బదిలీ

చిత్తూరురూరల్, సెప్టెంబరు 25: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 34 మంది ఎంపీడీవోలను బదిలీ చేస్తూ జడ్పీ సీఈవో గ్లోరియా ఉత్తర్వులు జారీ చేశారు. రామచంద్రాపురం ఎంపీడీవోగా ఇందిరమ్మ, ఎర్రావారిపాళ్యానికి అరుణ, ఐరాలకు ధనలక్ష్మ, గుడిపాల కు శివరాజు, కురబలకోటకు గంగయ్య, మదనపల్లెకు తాజ్ మస్రూర్, చిత్తూరుకు కె.శ్రీనివాసులు, పిచ్చాటూరుకు మహ్మద్‌రఫీ, కలకడకు అబ్దుల్ రహీం, కార్వేటినగరానికి చంద్రమౌళి, వడమాలపేటకు శేషగిరిరావు, కలికిరికి భానుమూర్తి రావు, తొట్టంబేడుకు సురేంద్రనాథ్, గంగవరానికి సురేష్‌బాబు, కేవీపల్లికి సుధాకర్, పెద్దపంజాణికి కేఎస్ బాలాజీ, సోమలకు అబ్దుల్ కలామ్ ఆజాద్, వెదురుకుప్పానికి అమరనాథ్, పూతలపట్టుకు నాగరాజు, ములకలచెరువుకు హరినారాయణ, రామసముద్రం ఎంపీడీవోగా భానుప్రసాద్ బదిలీ అయ్యారు.నిమ్మనపల్లె ఎంపీడీవోగా పరమేశ్వరరెడ్డి, రొంపిచెర్లకు మధుసూదనరెడ్డి, శాంతిపురానికి ప్రేమ్‌రాజ్‌కుమార్, గుడుపల్లికి లీలా మాధవి, తిరుపతి రూరల్‌కు రామచంద్ర, రేణిగుంటకు రమేష్‌బాబు, చిన్నగొట్టిగల్లుకు గిడ్డయ్య, తంబళ్ళపల్లికి ఉపేంద్రరెడ్డి, పీలేరుకు శివశంకర్, పీటీఎం ఎంపీడీవోగా విష్ణు చిరంజీవి బదిలీ అయ్యారు. నాగలాపురం ఎంపీడీవోగా బాలాజీ నాయక్, ఏర్పేడుకు సౌభాగ్యం, రామకుప్పం ఎంపీడీవోగా లక్ష్మీకాంత్‌లను బదిలీ చేశారు. మిగిలిన 31మండలాల విషయానికి వస్తే 17 మండలాల్లో ఏవోలు, ఈవోఆర్డీలు ఇన్‌చార్జి ఎంపీడీవోలుగా వ్యవహరిస్తున్నారు. 14 మండలాల్లో ఎంపీడీవోలకు అక్కడ ఐదేళ్ల సర్వీసు పూర్తి కాకపోవడంతో వారంతా అక్కడే ఉన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

పెద్దమండ్యం, సెప్టెంబరు 25: ప్రభుత్వ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని పీఆర్ డీఈ మునిరాజ పేర్కొన్నారు. మండలంలో బుధవారం పీఆర్‌డీఈ పర్యటించారు. కోటకాడపల్లి, శివపురం, బురుజుకురవపల్లి, ముసలికుంట, కురిమిరెడ్డిగారిపల్లి, మందలవారిపల్లి, దిగువపల్లి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈయన వెంట ఏఈ షాబాద్‌బాషా, ఇంజనీరు అసిస్టెంట్‌లు పవన్‌కుమార్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

నేడు కేంద్ర ప్రభుత్వ పథకాల పరిశీలన

ములకలచెరువు, సెప్టెంబరు 25: మండలంలో గురువారం నేషనల్ లెవల్ మానిటరింగ్ కమిటీ క్షేత్ర స్థాయిలో కేంద్ర ప్రభుత్వ పథకాలను పరిశీలించనుందని ఇన్‌చార్జి ఎంపీడీవో గౌస్ పేర్కొన్నారు. మండలంలోని ములకలచెరువు, దేవళచెరువు, సోంపల్లె గ్రామాల్లో ఏకసభ్య కమిటీ పర్యటించనుంది. పథకాలపై లబ్ధిదారులు, అధికారుల నుంచి అభిప్రాయ సేకరణ చేయనున్నట్లు తెలిపారు.

సివిల్ సప్లైస్ కూలీల నిరసన

బి.కొత్తకోట, సెప్టెంబరు 25: సివిల్‌సప్లైస్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు, తమ డిమాండ్ల పరిష్కారం కోసం బి.కొత్తకోట సివిల్‌సప్లైస్ గోడౌన్‌లో పనిచేసే కూలీలు నిరసన చేపట్టారు. బుధవారం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో వున్న గోడౌన్ వద్ద వీరికి మద్దతుగా ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సలీంబాషా, వేణుగోపాల్‌రెడ్డిలతో పాటు, బాబాజాన్, గంగాధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'పేదల మన్ననలు పొందిన ప్రభుత్వం'

తంబళ్లపల్లె, సెప్టెంబరు 25: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలోనే ఇచ్చిన హామీలను అమలు చేసి పేద ప్రజల మన్ననలు పొందిందని రాజంపేట బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్ అన్నారు. బుధవారం కూటమి నేతలు, సచివాలయ సిబ్బంది కోసువారిపల్లెలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

యువకుడికి తీవ్ర గాయాలు

పీలేరు, సెప్టెంబరు 25: బోడుమల్లువారిపల్లె వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భానుప్రకాశ్(30) అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఎర్రగుంటపల్లె పంచాయతీ నెట్టిబండ కాలనీకి చెందిన భానుప్రకాశ్, తన వ్యక్తిగత పనుల నిమిత్తం బోడుమల్లువారిపల్లెకు వెళ్లి పీలేరుకు తిరిగి వస్తుండగా నూతనంగా నిర్మించిన బైపాస్ రోడ్డు వద్ద వేలూరు నుంచి కడపకు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన భానుప్రకాశ్‌ను స్థానికులు 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అతనిని తిరుపతి రుయా ఆసుపత్రికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అథ్లెటిక్స్‌లో తంబళ్లపల్లె విద్యార్థుల సత్తా

తంబళ్లపల్లె, సెప్టెంబరు 25: తంబళ్లపల్లె నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కన్నెమడుగు హైస్కూల్, కేజీబీవీ విద్యార్థులు సత్తా చాటి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పీడీ మొఘల్ ఖాదర్‌బాషా, పీఈటీ హంసవేణిలు తెలిపారు. బుధవారం కురబలకోటలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17, 14 విభాగాలలో మండల స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. వీరు 26న చిత్తూరు డీఎస్సీ మైదానంలో జరిగే జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొంటారని తెలిపారు.


ప్రజల సమస్యలు నిర్లక్ష్యం చేయొద్దు

వాల్మీకిపురం, సెప్టెంబరు 25: ప్రజల సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం వాల్మీకిపురం తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పామిలేటి, సూపరింటెండెంట్ ఫైరోజాబేగం, ఎంపీడీవో మనోహర్‌రాజు, ఎంఈవో వెంకటరత్నం, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

నీట్ ర్యాంకర్‌కు అభినందనలు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 25: మండలంలోని మోడల్‌స్కూల్‌లో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థి మహమ్మద్ షాహిద్‌ఖాన్‌కు బుధవారం పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మూర్తి మాట్లాడుతూ ఆల్ ఇండియాలో 2024లో జరిగిన నీట్ పరీక్షలలో 25,769 ర్యాంకు సాధించగా ఏపీలో 546 ర్యాంకు సాధించినట్లు తెలిపారు. దీంతో విద్యార్థి మహమ్మద్ షాహిద్‌ఖాన్‌కు అభినందనలు తెలిపారు.

హౌసింగ్ పట్టా కేటాయింపుపై విచారణ



హౌసింగ్ కార్యాలయంలో విచారణ చేస్తున్న అసిస్టెంట్ మేనేజర్

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 25: మదనపల్లె మండలం వలసపల్లె వద్ద హౌసింగ్ అర్బన్ లే అవుట్‌లో ఓ పోస్టల్ ఉద్యోగి భార్య పేరిట హౌసింగ్ ఇంటి పట్టా ఇవ్వడమే కాక, హౌసింగ్ పథకంలో ప్రభుత్వ నిధులు కేటాయించిన విషయమై వచ్చిన ఫిర్యాదుపై హౌసింగ్ పీడీ కార్యాలయ అసిస్టెంట్ మేనేజర్ విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే. వలసపల్లె అర్బన్ లే అవుట్‌లో 15 మంది ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని, హౌసింగ్ పథకం కింద ఇళ్లు కూడా నిర్మించుకున్నారని స్థానికులు కలెక్టర్‌కు గ్రీవెన్స్‌డేలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్, హౌసింగ్ పీడీని, మదనపల్లె తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ క్రమంలో బుధవారం స్థానిక హౌసింగ్ ఈఈ కార్యాలయంలో పీడీ కార్యాలయ అసిస్టెంట్ మేనేజర్ సుబ్బరామయ్య, సీఎల్‌టీసీ గురుప్రసాద్ విచారణ చేపట్టారు. పోస్టల్ ఉద్యోగి భార్య దీపను విచారించి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఆమె మాట్లాడుతూ 2018 సంవత్సరంలో తాము టిడ్కో ఇంటి కేటాయింపునకు మున్సిపాలిటీలో రూ.25 వేలు డీడీ చెల్లించామన్నారు. టిడ్కో ఇళ్లు ఆలస్యమవుతుండటంతో అప్పటి ప్రభుత్వం 2020 సంవత్సరంలో తమకు అర్బన్ లేఅవుట్‌లో ఇంటి స్థలం కేటాయించారన్నారు. అప్పుడు తమకు సంవత్సర ఆదాయం తక్కువగా వుండటంతో, తెల్లరేషన్ కార్డుతోనే ఇంటి స్థలం కేటాయించారన్నారు. హౌసింగ్ పథకం కింద రూ.1.80 లక్షలు మంజూరు చేయగా ఇంటి నిర్మాణం పూర్తి చేశామన్నారు. ఇప్పుడు వచ్చిన ఫిర్యాదులతో హౌసింగ్ పథకం కింద తమకు ప్రభుత్వం మంజూరు చేసిన మొత్తం ప్రభుత్వానికి తిరిగి చెల్లిస్తామని, ప్రస్తుతం తాము నిర్మించుకున్న ఇంటికి స్థలాన్ని క్రమబద్ధీకరించేందుకు అవకాశం ఇవ్వాలని హౌసింగ్ అధికారులకు స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఇన్‌చార్జి డీఈ దీనదయాళ్‌రాజు, ఏఈ గణేష్ పాల్గొన్నారు.